యువత విజయోత్సాహం



నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మండపేటలో ఉత్సాహంగా ముగిశాయి. కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. పాల్గొన్న క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారితో సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు జట్టును నిర్వాహకులు ఎంపిక చేశారు. - న్యూస్‌టుడే, మండపేట

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం



వాడపల్లి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ చేయనున్నారు. తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమీయనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శేషవాహనంపై మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామి విహరిస్తారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

సమావేశం.. సాంస్కృతిక సౌరభం

కాకినాడ జిల్లా తాళ్లరేవు కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ జిల్లా సమావేశం ఆదివారం జరిగింది.



2025లో సేవలను నిర్వహించే నూతన కార్యవర్గాన్ని, జిల్లా గవర్నర్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. -న్యూస్‌టుడే, తాళ్లరేవు

● ముగ్గురు ఉద్యోగులకు ఛార్జి మెమో

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో భక్తులకు గదులు కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులకు ఛార్జిమెమో ఇస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. సీనియర్ అసిస్టెంట్లు పెన్నాడ వెంకటేశ్వరరావు, ఎం.ఎల్ గణపతిరావు, రికార్డు అసిస్టెంటు పి.తలుపులయ్యలు మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల వివాహాల రద్దీ సమయంలో వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి, భక్తులకు ఇబ్బందులు లేకుండా గదుల కేటాయింపులో జాబితా సిద్ధం చేస్తూ ఈవో ఆదేశాలిచ్చారు. అయితే గదులు కేటాయించకపోవడం, తీవ్ర జాప్యంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నారు.

● ఆన్‌లైన్‌లో సీనియార్టీ జాబితా

మసీదు సెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని జిల్లా డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటల్లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీపై తెదేపా గురి

■ అభ్యర్థిగా రాజశేఖర్ పేరు ప్రకటన
■ మొదలైన ఎన్నికల సందడి

కాకినాడ కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిని ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో సందడి మొదలయ్యింది. 2025, మార్చిలో జరగనున్న ఈ ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వేమవరానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ పేరును తెదేపా అధినేత నారా చంద్రబాబు ఖరారు చేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపి, విజయం సాధించేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కొద్ది రోజులుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో ఓటు నమోదు ఊపందుకుంది.

ఇదీ నేపథ్యం పేరాబత్తుల రాజశేఖర్ ఆది నుంచీ తెదేపాలో కొనసాగుతున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి ఆయనకు త్రుటిలో తప్పింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గం నుంచి తెదేపా టికెట్ ఆశించినా పొత్తుల్లో భాగంగా కుదర్లేదు.

నాడు 46 మంది బరిలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఇళ్ల వెంకటేశ్వరరావు(పీడీఎఫ్) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 నాటి ఎన్నికల్లో 46 మంది పోటీలో నిలిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే ఇళ్ల విజయం సాధించారు. పీడీఎఫ్ నుంచి ఈసారి ఇంకా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. మరికొందరు స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

■ విధేయతకే పట్టం

- పేరు: పేరాబత్తుల రాజశేఖర్
- వయసు: 51
- తల్లిదండ్రులు: ఆది పటాభి రామయ్య, బాపిరత్నం
- విద్యార్హత: బీఏ
- కుటుంబం: భార్య సత్యవాణి, ఇద్దరు కుమారులు
- వృత్తి: ఆక్వా వ్యాపారం



తెదేపా అధినేత చంద్రబాబుతో రాజశేఖర్

పట్టభద్రుల సంఖ్య ఎక్కువే..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,93,794 మందికి ఓటు హక్కు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,72,415, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 1,21,379 మంది ఓటర్లు అప్పట్లో ఉన్నారు.

● యువత అవకాశాల కల్పనకు కృషి

నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసిన అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆయనను అభ్యర్థిగా ఖరారు చేయడంతో కాకినాడలోని ఆయన నివాసంలో పలువురు కూటమి నాయకులు అభినందించారు. తునిలో తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఇతర నాయకులను కలిసిన రాజశేఖర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

■ పేరాబత్తుల పదవులు..

- ❖ 1996లో జి.వేమవరం ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నిక(కాంగ్రెస్)
- ❖ 2001-05 జిల్లా తెలుగు యువత కమిటీ సభ్యుడు
- ❖ 2006-11 ఐ.పోలవరం ఎంపీపీగా ఎన్నిక
- ❖ 2012-14 జిల్లా తెలుగు యువత కార్యదర్శి
- ❖ 2014-19 ఐ.పోలవరం జడ్పీటీసీగా ఎన్నిక.
- ❖ 2020-21 అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి
- ❖ 2021-24 కాకినాడ గ్రామీణ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి
- ❖ 2021-23 కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడి నియామకం
- ❖ 2023 నుంచి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, చంద్రబాబునాయుడి కార్యక్రమాల సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

ఇంజినీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యం..!

బదిలీపై వెళ్లిన అధికారిణి సిఫార్సులకే పెద్దపీట

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్



ఇంజినీరింగ్ విభాగంలో డ్రాయింగ్ బ్రాంచి

ఆన్‌లైన్ టెండర్లలో అవకతవకలు.. ఎల్-1 గుత్తేదారులకు పనులు ఇవ్వకుండా ఎల్-2 గుత్తేదారులకు అప్పగింత.. ఇదీ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో వైకాపా ప్రభుత్వ హయాంలో తీరు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేసి ఓ అధికారిణిని బదిలీ చేసినా ఇప్పటికీ ఆమె పెత్తనమే కొనసాగుతోంది.

వైకాపా హయాంలో కాకినాడ నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో పనుల అంచనాలు పెంచేసి, అవసరం లేకపోయినా చేసి ఖజానాను కొల్లగొట్టారు. నాటి స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సులకు వంతపాడారు. ఇంజినీరింగ్ విభాగాధిపతిగా ఉన్న ఒక అధికారిణి కనుసన్నల్లోనే ఇవన్నీ జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమెను బదిలీ చేసినా, కొత్తగా వచ్చిన ఉన్నతాధికారిణిని బుట్టలో వేసుకున్నారు. వైకాపా అనుకూల గుత్తేదారులకు రూ.40 లక్షల వరకు బిల్లులు ఇప్పించారు. ఇతర గుత్తేదారులకు మొండిచేయి చూపారు.

వర్క్ఇన్‌స్పెక్టర్‌ను ఇన్‌ఛార్జిగా పెట్టి..

ఇంజినీరింగ్ విభాగంలో డ్రాయింగ్ బ్రాంచి ద్వారా అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సీఎఫ్ఎంఎస్, మున్సిపల్ కమిషనర్‌కు వెళ్తాయి. ఇక్కడ సదరు అధికారిణి ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఇన్‌ఛార్జిగా పెట్టి నడిపించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.2 లక్షలు వెచ్చించి ప్రత్యేక ఛాంబర్ కట్టించారు. ఇక్కడ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి 20 ఏళ్లుగా అదే క్యాడర్‌లో ఉన్నారు. గుత్తేదారు అవతారమెత్తారు. నిర్మాణ సంస్థను నెలకొల్పి, కార్పొరేషన్‌లో చాలా పనులు వచ్చేలా చేశారు. సదరు అధికారిణికి ఇందులో వాటాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఆన్‌లైన్ టెండర్లలోనూ అవకతవకలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి.

రూ.50 కోట్ల బిల్లులు వారికే..

వైకాపాకు చెందిన ఒక మాజీ కార్పొరేటర్ గుత్తేదారు అవతారమెత్తి మెజారిటీ అభివృద్ధి పనులు దక్కించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని నిర్మాణాలకు కార్పొరేషన్ సాధారణ నిధులు వెచ్చించేలా చేశారు. వాటికి సుమారు రూ.ఆరు కోట్ల బిల్లులు చెల్లించేశారు. మిగతా గుత్తేదారులకు రూ.70 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోలేదు. వైకాపా హయాంలో సుమారు రూ.50 కోట్ల బిల్లులు ఆ పార్టీ అనుకూల గుత్తేదారులకే చెల్లించారనే ఆరోపణలున్నాయి. వైకాపా హయాంలో కొందరు ఏఈఈలు కమీషన్లు కొట్టేశారు.

లోపాలు సరిదిద్దుతాం: అంశాలు పరిశీలించి ప్రక్షాళన చేస్తాం. నగరపాలక సంస్థలో చేపట్టిన పనులు, బిల్లుల పెండింగ్, రికార్డు చేయాల్సిన బిల్లులు పరిశీలించి, అవసరమైన చర్యలు చేపడతాం. - పి.కామేశ్వరరావు, ఎస్ఈ(ఎఫ్ఏసీ)

ఉసురుతీసిన విద్యుత్తు తీగ



మృతులు విశ్వేష్, పద్మ(పాతచిత్రం)

24 గంటల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి

సామర్లకోట: విద్యుత్తు తీగ యమపాశమైంది. రోజు వ్యవధిలో తల్లి, కుమారుడిని బలి తీసుకుంది. శనివారం తల్లి మృతి చెందగా.. ఆదివారం కుమారుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన సామర్లకోటలోని వీరరాఘవపురంలో చోటుచేసుకుంది. గ్రామంలోని నీలమ్మచెరువు వద్ద నివసించే చిట్టిమాని కామరాజు, పద్మ (43) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు విశ్వేష్(23) ఉన్నారు. పద్మ ఇళ్లలో పనులు చేస్తుండగా.. విశ్వేష్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంటి వద్ద కొళాయి సమీపంలో దుస్తులు ఉతికి వాటిని ఆరేయడానికి వెళ్లిన పద్మ విద్యుదాఘాతంతో కాలువలో పడి మృతిచెందారు. ఆమె ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు భావించారు. తల్లి మృతితో దుఃఖంతో ఉన్న విశ్వేష్‌కు ఆదివారం బంధువులు అల్పాహారం అందించారు. తిని చేయి కడగడానికి కొళాయి వద్దకు వెళ్లిన ఆయన వేలాడుతున్న విద్యుత్తు తీగ తగిలి షాక్‌తో కిందపడిపోయాడు. తల్లి మృతిచెందిన చోటే ఆయన కూడా పడిపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాలను గమనించగా విద్యుత్తు తీగ కనిపించింది. తక్షణం అధికారులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి సరఫరా నిలిపివేశారు. విశ్వేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. 24 గంటల వ్యవధిలో తల్లీబిడ్డ మృతిచెందడంతో కుటుంబీకులు దుఃఖసంద్రంలో మునిగిపోయారు.

నిర్లక్ష్యంపై ఆందోళన

ఇటీవల వినాయక చవితి సందర్భంగా ఊరేగింపునకు కామరాజు ఇంటి నుంచి విద్యుత్తు సరఫరా తీసుకున్నారు. ఆ సమయంలో సర్వీసు వైరుకు ఆధారంగా వేసిన జీఐ తీగ తెగిపోగా అడ్డుగా ఉందని సమీపంలోని చిన్న చెట్టుకు చుట్టేశారు. ఆ వైరుకు విద్యుత్తు సరఫరా జరిగి ఇద్దరిని బలితీసుకుందని, విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పూలరథంలో దుర్గమ్మ విహారం



గొల్లప్రోలులో దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఉత్సవాలు నిర్వహించారు. కనకదుర్గమ్మను పూల రథంపై కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు దారిపొడవునా.. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పిఠాపురం.. ప్రగతి పవనం..

న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పిఠాపురం

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడం విశేషం. ప్రణాళిక ప్రకారం కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు స్థానికంగా పర్యటించి సమస్యలు గుర్తించి ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమీక్షల అనంతరం పవన్‌కల్యాణ్‌కు నివేదికలు అందజేశారు. ఆయన ఆదేశాలతో జిల్లా స్థాయి అధికారులతో 21 బృందాలు ఏర్పాటు చేసి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వాటిని పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులను కలెక్టర్ షాన్‌మోహన్ వివరించారు.



కొత్తపల్లి పీహెచ్‌సీలో గీజర్

పరిష్కరించిన సమస్యలివి..

● పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌రే యంత్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. అవసరమైన వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టారు. ● కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజులకే పిఠాపురం ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరిచారు. ● విద్యార్థుల కోసం 32 పాఠశాలలకు క్రీడా సామగ్రి కిట్ల పంపిణీ ప్రారంభించారు. ● గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పైపులైను ఏర్పాటుతో ఆర్వో ప్లాంటు నాలుగేళ్ల తర్వాత వినియోగంలోకి వచ్చింది. 449 మంది విద్యార్థులకు శుద్ధజలం అందుతోంది. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్వో ప్లాంటును అందుబాటులోకి తెచ్చారు. ● గొల్లప్రోలులో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.1.10 లక్షలతో రెండు కంప్యూటర్లు సమకూర్చారు. ● తాటిపర్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ, మైదానంలో ప్రమాదకర విద్యుత్తు లైన్లు మార్పు చేయించారు. ● యు.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రసూతి శిశువులకు అవసరమైన వేడి నీరు సమకూర్చేందుకు గీజర్, రక్షిత నీటి సరఫరాకు పరికరం ఏర్పాటు చేశారు. ● గొల్లప్రోలులోని ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీ వద్ద, నివాస గృహాల మధ్యలో 1.5 ఎకరాల విస్తీర్ణంలో పేరుకుపోయిన చెత్తను 25 సెంట్ల స్థలంలో వేసేలా ఏర్పాటు చేశారు. డంపింగ్‌యార్డుకు భూసేకరణకోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ● గొల్లప్రోలు పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. ● నాగులాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ● వన్నెపూడి శివారున శ్మశానానికి దారికి భూసేకరణకు ప్రతిపాదించారు. ● గొల్లప్రోలులో యూపీహెచ్‌సీ, తహసీల్దారు కార్యాలయ భవనాల పనులకు అదనపు నిధులివ్వనున్నారు. ● గొల్లప్రోలు-సూరంపేట వంతెన నిర్మాణానికి రూ.26 లక్షలు కేటాయించారు.



గొల్లప్రోలులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుద్ధజలం పొందుతున్న విద్యార్థులు

కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(వినతుల స్వీకరణ) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరిస్తారని తెలిపారు. అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నేడు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నేడు నిర్వహించనున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం తెలిపారు. జిల్లా పాత పోలీసు కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం అమరవీరుల స్తూపం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు సంస్మరణ సభ నిర్వహిస్తామన్నారు.

మత్స్యకార.. హితకారి

బోటు యజమానులకు ఉచితంగా ట్రాన్స్‌పాండర్లు





బోటు, ట్రాన్స్ పాండర్స్ పరికరం

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: జిల్లాలో వేల సంఖ్యలో కుటుంబాలు వేట జీవనాధారంగా పనిచేస్తున్నాయి. మెకనైజ్డ్ బోట్లపై సముద్రంలో సుదూర ప్రాంతాలకు వెళ్తారు. ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే, తుపాన్లు వంటివి వస్తే, అసలు మత్స్య సంపద దొరక్కపోతే పొరుగు దేశాల సరిహద్దుల్లోకి వెళ్లిపోతే వారి ఇబ్బందులు వర్ణనాతీతం. వారి సమస్యలకు చెక్ పెట్టడానికి, భరోసా కల్పించడానికి ప్రభుత్వం ట్రాన్స్ పాండర్స్ అనే పరికరాన్ని పూర్తి రాయితీపై అందిస్తోంది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎస్‌వై) పథకం కింద మత్స్య శాఖ అందిస్తోంది. కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) దీన్ని రూపొందించింది. ఇందులో రెండు భాగాలు ఉంటాయి. ఒకదాన్ని బోటుకు, మరో భాగాన్ని డ్రైవర్ వద్ద ఉంచుతారు. బ్యాటరీ సాయంతో పని చేస్తుంది. రూ.21 వేలు విలువైన ఈ పరికరాన్ని గతంలో 40శాతం రాయితీపై ఇచ్చేవారు. వైకాపా పాలనలో దీని సంగతే మర్చిపోయారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. బోటు యజమానులకు రాయితీపై ఉచితంగా ఇస్తున్నారు.

- మండలాలు 21
- మత్స్యకార మండలాలు: 5 (తొండంగి, కాకినాడ నగరం, కాకినాడ గ్రామీణం, కరప, తాళ్లరేవు)
- తీర ప్రాంతం 83 కి.మీ.
- మత్స్యకార గ్రామాలు 53
- వేటపై ఆధారపడ్డ కుటుంబాలు 24 వేలు
- మొత్తం బోట్లు: 4,465
- మెకనైజ్డ్ బోట్లు 395

ఇవీ ప్రయోజనాలు..

● సముద్రంలో మత్స్య సంపద ఎక్కడ అధికంగా ఉందో తెలుస్తుంది. ● తుపాన్లు, వాయుగుండాల సమాచారం చెబుతుంది. ● పొరుగు దేశాల సరిహద్దులోకి వెళ్తే కి.మీ. దూరంలో ఉండగానే సంకేతాలు ఇస్తుంది. ● ప్రమాదం సంభవిస్తే డ్రైవర్ వద్ద అమర్చిన పరికరంపై ఎస్ఓఎస్ మీట నొక్కగానే కేంద్ర కోస్టుగార్డు కార్యాలయానికి సమాచారం వెళ్తుంది. వారు అప్రమత్తమై సహాయం అందేలా చూస్తారు. ● దీనికి ప్రత్యేక సంఖ్యను కేటాయించి, ఆన్‌లైన్‌లో టాగ్ చేస్తారు. ఏదైనా జరిగితే సమాచారం శాటిలైట్ ద్వారా కోస్టుగార్డు, మత్స్యకార కార్యాలయానికి, బోటు యజమానికి వెళ్తుంది.

సద్వినియోగం చేసుకోండి..

ఇతర దేశాలకు చెందిన నాసిరకం పరికరాలతో ప్రయోజనం ఉండదు. సరిగ్గా పనిచేయవు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పరికరం చక్కగా పని చేస్తుంది. బోటు యజమానులకు ఉచితంగా ఇస్తున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలి. - కె.కరుణాకరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి



చిగురించే టమాటా చుట్టూ.. చీరకట్టు

టమాటా ధర ఆకాశాన్ని అంటుతోంది. ఈ క్రమంలో ఆ సాగు ఎంతో అపురూపమైంది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామానికి చెందిన రైతు మేదుళ్ల రాంబాబు అరెక రంలో టమాటా పండిస్తున్నారు. ఈ పంటకు మంచి డిమాండ్ ఉండటంతో దిష్టి తగలకుండా చుట్టూ చీరలు కట్టారు. అటుగా వెళ్లే వాళ్లు ఆసక్తిగా చూస్తున్నారు.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

98 చక్రాల బాహుబలి

10.. 20.. 30.. కాదు ఏకంగా 98 చక్రాల హైడ్రాలిక్ యాక్సిల్ ట్రైలర్ ఇది. తమిళనాడు రాష్ట్రంలోని సేలం నుంచి ఒడిశాలోని తాల్చేరు విద్యుత్తు కర్మాగారానికి భారీ యంత్ర పరికరాలను అధికారులు ఇలా బాహుబలి వాహనంపై తరలిస్తున్నారు. మార్గంమధ్యలో జాతీయ రహదారి నంబరు 16పై ప్రత్తిపాడు వద్ద ఈ భారీ వాహనం కాసేపు ఆగింది. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



నీటి కుక్క.. కనిపించెను ఎంచక్కా..



సామర్లకోటలోని గోదావరి కాలువలో ఆదివారం నీటి కుక్కలు సందడి చేశాయి. వి.కె.రాయపురం-మాధవపట్నం మార్గంమధ్యలోని గోదావరిలో మూడు నీటికుక్కలు ముందుకూ.. వెనక్కి నీటిలో ఈదుతూ కనిపించాయి. గోదావరి పరివాహక ప్రాంతాలు, జల వనరులు అధికంగా ఉండే ప్రాంతాల్లో గుంపులుగా ఇవి సంచరిస్తుంటాయి. నీటిలో, నేలపై సంచరించగలిగే అరుదైన ఈ జీవులు చేపలను ఆహారంగా తీసుకుని జీవిస్తాయి.

- న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం

జలజల.. గలగల

ప్రత్తిపాడు మండలంలోని ఎరకంపాలెం ఉప ప్రణాళిక మన్యం తూర్పు కనుమల్లోని జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. కొండల నుంచి వచ్చే ఊటనీరు ఏడాది పొడవునా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో మరింత రమణీయంగా కనువిందు చేస్తుంది. సముద్ర మట్టం నుంచి 1,700 మీటర్ల ఎత్తులో ఉండే ఈ జలపాతం కనువిందు చేస్తుంది. సెలవురోజులు కావడంతో అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు.

- ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



పిచ్చుకగూళ్లు.. చూస్తేనే తెరుచుకుంటాయి నోళ్లు..

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ అంటే ఆహ్లాదకరమైన పచ్చదనమే కాదు.. అదిరిపోయే రుచులకూ నిలయమాయె.. ఇక్కడ తయారైన పిచ్చుకగూళ్లను కరకరలాడుతూ ఆరగించేస్తారు. ఇదేంటి.. చిత్రంగా పిచ్చుక గూళ్లను తినడమేమిటని అనుకోకండి..! తీయగా ఉండే గగ్రాజులను ఇక్కడి వాళ్లంతా దాని ఆకారాన్ని బట్టి పిచ్చుకగూళ్లని పిలుస్తుంటారు. విదేశాల నుంచి వచ్చిన వంటకం ఇది. దీని కథాకమామీషును తెలుసుకుందాం..!



నోరూరించే గగ్రాజులు

216 జాతీయ రహదారి చెంత..

నగరం నుంచి మామిడికుదురు వరకు 216 జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 70 వరకు గగ్రాజులు తయారు చేసే దుకాణాలు విస్తరించాయి. రహదారి వెంటే వీటిని వండుతూ విక్రయాలు చేస్తున్నారు. ప్రయాణికులు, వాహన చోదకులు వీటిని ఆసక్తిగా తిలకించడంతో ఆగకుండా ఆగి మరీ రుచి చూసి తీసుకువెళ్తున్నారు. ఆర్డర్లపై మరీ వీటిని చక్కగా కొనుగోళ్లు చేస్తున్నారు.

తయారు చేసేదిలా..

నానబెట్టిన బియ్యాన్ని యంత్రాలకు అమర్చిన రోళ్లతో పిండిగా చేసి పాకం పట్టిన బెల్లం లేదా పంచదారను అందులో కలిపి ధారగా పడేలా వలయం చేస్తారు. బాగా కాగిన నూనెలో రంధ్రాలున్న నిలువు చట్రం ద్వారా పిండిని తిప్పుతూ అందులో గుండ్రంగా పోస్తారు. కాసింత వేగిన తర్వాత దానిని అర్ధ చంద్రాకారంలో మడిచి దోరగా వేగే వరకు ఉంచుతారు. కొందరు నూనెకు బదులుగా నెయ్యి ఉపయోగిస్తారు. బెల్లం, పంచదారతో కాకుండా తేనెతో తయారు చేయించుకుంటారు. 30 నుంచి 40 గ్రాముల వరకు బరువుండే ఒక్కో గగ్రాజ్ రూ.10 నుంచి రూ.12కు విక్రయిస్తున్నారు. గాలి తగలని డబ్బాల్లో వీటిని జాగ్రత్త చేసుకుంటే దాదాపు మూడు వారాల వరకు నిల్వ ఉంటాయి.



తీపి గగ్రాజుల తయారీలో మహిళ

ఇక్కడికిలా వచ్చి చేరింది..

దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం ఉపాధి కోసం బర్మా వెళ్లిన మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని కొందరు ముస్లింలు అక్కడి వంటకాన్ని ఇక్కడికి తీసుకువచ్చారు. అది క్రమేణా వారి శుభకార్యక్రమాల్లో ఓ సంప్రదాయ మిఠాయిగా నిలిచింది. అలా స్థానికంగా నగరం, మామిడికుదురులోనే దాదాపు 200 కుటుంబాల వారికి ఉపాధిగా మారింది. కోనసీమ మీదుగా ఉన్న 216 జాతీయ రహదారి వల్ల బాహ్య ప్రపంచంలో వీటికి బంధం మరింత ఏర్పడింది. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో పలు చోట్ల వీటి విక్రయాలు పెరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో సహా యూఎస్‌ఏ, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు వీటిని ప్రత్యేకంగా అట్ట పెట్టెల్లో భద్రపరచి తీసుకువెళ్తున్నారు.

దాత ఔదార్యం.. ఫలించిన ప్రయోగం

పెద్దమనసు చాటుకున్న ఆర్బీఐ పూర్వ సీజీఎం రామశాస్త్రి

న్యూస్‌టుడే, పెద్దాపురం

విద్యార్థి దశలో పాఠ్యాంశాన్ని మనసులో నిక్షిప్తం చేసుకోవడానికి ప్రయోగాలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రయోగాత్మకంగా పాఠాలు వివరిస్తే సత్వరం విద్యార్థుల మెదడులో నాటుకుపోయి వారు మరచిపోకుండా ఉండేలా సాయపడతాయి. సైన్స్ పాఠాలు చదవడమేకాదు, ప్రయోగాలు చేయడం ద్వారా చక్కగా అర్థమవుతాయని విశ్వసించిన హైదరాబాద్‌కు చెందిన భారత రిజర్వు బ్యాంకు పూర్వ చీఫ్ జనరల్ మేనేజర్ అల్లంరాజు రామశాస్త్రి.. పెద్దాపురం పట్టణంలో అల్లంరాజు చారిటబుల్ ట్రస్టు (శ్రేయా, కాకినాడ సహకారంతో) పేరుతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. రామారావుపేటలో 2023 సంవత్సరంలో రూ.15 లక్షల వ్యయంతో కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో భౌతిక, రసాయన, జీవశాస్త్ర పాఠాలకు ఉపయోగపడేలా ప్రయోగాలు ఏర్పాటుచేశారు. కేంద్రంపై మండలంలోని గోనెడ ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బుద్ధాల శ్రీనివాస్ పనితీరును తెలుసుకుని రామశాస్త్రి ఆయనకు కేంద్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పెద్దాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ కేంద్రంలో ప్రయోగ పాఠాలు అభ్యసిస్తున్నారు. రోజూ జిల్లా నలుమూలల నుంచి 40 మంది వరకు విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు ఆరు వేల మంది 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ప్రయోగాల ద్వారా పాఠాలు నేర్చుకున్నారు.



కేంద్రంలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు



జీవశాస్త్ర ప్రయోగాలకు నమూనాలు

బట్టీపడితే సైన్స్ రాదు..

సైన్స్ పాఠ్యాంశాలు బట్టీపడితే రావు. ప్రయోగాల ద్వారా పాఠం పూర్తిగా అర్థమవుతుంది. రోజూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు వారి ఉపాధ్యాయుల సూచన మేరకు ప్రయోగ పాఠాలు బోధిస్తాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ప్రయోగాల ద్వారా సైన్స్ బోధించే కేంద్రం ఇదొక్కటే. **- బుద్ధాల శ్రీనివాసు, కేంద్రం నిర్వాహకుడు**

ఎమ్మెల్సీ ఎన్నికలో విజయానికి కృషి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ సూచించిన అభ్యర్థి విజయానికి కూటమి నాయకులు కృషి చేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నాయకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. యువతకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. పార్టీ పేరుతో ఆరాచకాలకు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని యనమల స్పష్టం చేశారు. కూటమి నాయకులు ప్రజాసేవలో బాధ్యతయుతంగా ప్రవర్తించాలన్నారు. ఉచిత ఇసుక, మద్యం విధానంలో నాయకులు తలదూర్చకూడదని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రాజశేఖర్, కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, సుర్ల లోవరాజు నియోజకవర్గంలో మూడు మండలాలు, పట్టణప్రాంతానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న యనమల, నాయకులు

5 గంటలు ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: లింగంపల్లి నుంచి కాకినాడ పోర్టుకు రావాల్సిన గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 5 గంటలకు పైగా ఆలస్యంగా వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 12.11 నిమిషాలకు కాకినాడకు చేరుకుంది. సాధారణంగా ఈ రైలు లింగంపల్లి నుంచి రాత్రి 8.30 బయల్దేరి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి 9.10 నిమిషాలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.15కు బయల్దేరి 6.58కు కాకినాడకు చేరుకుంటుంది. 19వ తేదీ రాత్రి 9.15 నిమిషాలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరాల్సిన రైలు అర్ధరాత్రి దాటక 2.32 నిమిషాలకు బయల్దేరింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా ఆలస్యమైనట్లు రైల్వే వర్గాల సమాచారం.

200 కేజీల పశుమాంసం స్వాధీనం

గొల్లప్రోలు: చెందుర్తి శివారు కొత్త వజ్రకూటంలో ఆటోలో తరలిస్తున్న సుమారు 200 కేజీల పశుమాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కొంతమంది పశువును వధించి మాంసాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామన్నారు. చెందుర్తి గ్రామానికి చెందిన కట్టమూరు ప్రసన్నకుమార్ అలియాస్ జగన్, దొండపాటి అప్పారావు, కాకాడ ఉదయ్‌కుమార్‌లను అదుపులో తీసుకున్నామన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): జాతీయస్థాయి ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకు రావాలని కాకినాడ డీఎస్పీ డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడలో జరుగుతున్న అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో క్వాడ్, ఇన్‌లైన్ అంశాల్లో రోడ్డు, రింక్‌ల్లో పోటీలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-11, 14, 17, 19 విభాగాల్లోని క్వాడ్ విభాగంలో 24 మంది, ఇన్‌లైన్ విభాగంలో 24 మంది కలిపి 48 మంది జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 2వ వారంలో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. డీఎస్‌డీవో, హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, టోర్నమెంట్ పరిశీలకులు ఎస్.దిలీప్‌కుమార్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజగోపాల్, దొరస్వామిరాజు, కోశాధికారి సీహెచ్ రమేష్ విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా పీఈటీ అసిసోయేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.నూకరాజు, కోశాధికారి కొర్, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా అసిస్టెంట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులతో అతిథులు

కబడ్డీ ఛాంపియన్ కాకినాడ ఐడియల్ కళాశాల

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్శిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలతో పాటు, సౌత్ జోన్ కబడ్డీ జట్టు ఎంపిక ప్రక్రియ రెండు రోజుల పాటు మండపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఉభయగోదావరి జిల్లాల నుంచి సుమారు 250 మంది పాల్గొన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలకు 16 జట్లు పోటీ పడగా అంతర కళాశాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలో కాకినాడ ఐడియల్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా కాకినాడ పీఆర్ కళాశాల ద్వితీయ స్థానం, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా మొత్తం అన్ని టీముల నుంచి మెరుగైన క్రీడా నైపుణ్యం కనబరచిన 16 మంది క్రీడా కారులను నన్నయ యూనివర్శిటీ తరపున ఎంపిక చేశారు. వీరందరూ ఈనెల 30వ తేదీన చెన్నై ఎస్‌ఆర్‌ఎం కళాశాలలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర కళాశాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, వ్యాయామ అధ్యాపకుడు ఎన్.వీరాంజనేయులు, అధ్యాపకులు దిలీప్, రాజేష్ తదిరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన వివిధ కళాశాలల క్రీడాకారులు

తెదేపా కార్యకర్త హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలపై మారణాయుధాలతో దాడికి పాల్పడిన ఇద్దరు వైకాపా నాయకులను కాకినాడ కోర్టు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ దుమ్ములపేటలో ఈనెల 15న సీరం చిన్న, తాతారావులపై వైకాపా నాయకులైన దాసర సతీష్, పేర్ల దుర్గారావు మరి కొందరు దాడి చేశారు. పాతకక్షల నెపంతో జాతరలో ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో చిన్న తన కుడి కన్నును కోల్పోయారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ప్రధాన నిందితులు ఇద్దర్ని ఆదివారం పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు కోర్టు సీఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

ఆధార్ సరిచూశాకే వసతిగది కేటాయింపు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో భక్తులకు వసతి గదుల కేటాయింపులో అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. గది పొందే భక్తుడి ఆధార్‌ను సరిపోల్చిన తర్వాతే కేటాయించాలని ఈవో కె.రామచంద్ర మోహన్ ఆదేశాలిచ్చారు. సీఆర్వో (సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం)లో గదిని కేటాయించే సమయంలో భక్తుల ఆధార్‌కార్డు, ఫోను నంబరు వివరాలను కంప్యూటర్ రసీదుపై నమోదు చేయాలని సూచించారు. రసీదు తీసుకుని వసతి సముదాయం వద్దకు వెళ్లినప్పుడు అక్కడ విధుల్లో ఉండే గుమస్తా రసీదులో వివరాల ప్రకారం ఆధార్ కార్డును పరిశీలించి వివరాలు నమోదు చేసి గది తాళాలు అందించాలని ఆదేశించారు. గదిని ఖాళీ చేసిన తర్వాత సామగ్రి అంతా సరిగ్గా ఉందని ధ్రువీకరించి రసీదుపై నమోదు చేసి ఇవ్వాలన్నారు. అడ్వాన్సు రుసుం భక్తుడికి తిరిగి ఇచ్చేందుకు సీఆర్వో వద్ద ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కలెక్టరేట్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబరు 11న మైనార్టీ సంక్షేమం, జాతీయ విద్యా దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, విభిన్న రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25లక్షలు, ధ్రువపత్రం, జ్ఞాపిక, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష ప్రోత్సాహకం, ధ్రువపత్రం, జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయిదేళ్ల బోధనా అనుభవం ఉండాలన్నారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తును పూరించి, ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, రిజిస్ట్రార్ల ద్వారా ప్రమాణ ప్రతులను విజయవాడలోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీకి అందజేయాలన్నారు.

ఒప్పంద అధ్యాపకుల ఆందోళన

పిఠాపురం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో ఒప్పంద అధ్యాపకులుగా విధుల్లో చేరామని, ఇప్పటికీ తమను రెగ్యులరైజ్(క్రమబద్ధీకరణ) చేయలేదని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్‌ఎస్ శర్మ, జనరల్ కార్యదర్శి బీజే గాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్ వాపోయారు. ఆదివారం పిఠాపురం పురుహూతిక అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహించి, దత్తాత్రేయస్వామి సన్నిధిలో పొర్లుదండాలతో ప్రభుత్వాన్ని వేడుకున్నారు. రాష్ట్రంలో 400 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,618 మంది పనిచేస్తుండగా, జిల్లాలో 300 మంది ఒప్పంద అధ్యాపకులున్నారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రాజకీయ ప్రయోజనం ఆశించి 114 జీవో ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు.



దత్తాత్రేయ స్వామి సన్నిధిలో పొర్లుదండాలతో నిరసన

ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి

తాళ్లరేవు: వాసవీమాత ప్రపంచానికి చాటిన ప్రేమ, వాత్సల్యం, అహింస, ఆత్మ గౌరవాన్ని మనసులో నింపికుని ఆర్యవైశ్యులందరి ఐక్యతకు విశాల దృక్పథంతో పని చేస్తామని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు కె.రవిచంద్రన్ అన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవులోని కల్యాణ మండపంలో వాసవీక్లబ్ జిల్లా సమావేశం జిల్లా గవర్నర్ గోకవరపు వి.ఎన్. సుభాష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత వాసవీమాత చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాలోని 52 క్లబ్‌లు పని చేస్తున్నాయని అన్నారు. జిల్లా గవర్నర్ పరిధిలో చేపట్టిన సేవా కార్యక్రమాలపై సమీక్షించారు. 2025లో సేవలు నిర్వహించే నూతన కార్యవర్గాన్ని, జిల్లా గవర్నర్‌ను సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ కోశాధికారి సూర్యప్రకాశరావు, జిల్లా గవర్నర్ సుభాష్ ఆధ్వర్యంలో పది మంది ఆర్యవైశ్యులకు అవార్డులు అందించి సత్కరించారు. సభలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జి.సరిత, నాళం అండాళ్, రమేష్ వార్, బంగార్రాజు, పేకేటి సతీష్, అద్దేపల్లి లక్ష్మణ్, వరదా శేషయ్య, అత్తూలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన గీతం ఆలపిస్తున్న ప్రతినిధులు

ధూళిమూగి.. రజనురేగి..

పెద్దాపురం, న్యూస్‌టుడే: వేసవి ముగిసి.. శీతాకాలం రావడంతోనే పెద్దాపురం పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్టోబర్ నెల రావడంతోనే నల్లటి రజను, బూడిదతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల వివిధ పరిశ్రమల నుంచి వెలువడే బూడిద, రజను గాల్లో ఎగిరి ఇళ్లు, పరిసరాలను కమ్మేస్తోంది. కార్లు, ద్విచక్ర వాహనాలపై పేరుకుపోతోంది. పట్టణంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా ద్విచక్ర వాహనదారుల కళ్లలో పడుతోంది. నల్లటి రజను కంటిలో పడి గుడ్డుకి అతుక్కుపోయిందంటే కన్నుఎర్రగా మారి నీరు కారుతోంది. నీటితో కడుక్కున్నా పోవడంలేదని, వైద్యుని దగ్గరకు వెళ్లి రూ.100 ఫీజు ఇచ్చి తొలగించుకోవాల్సిందేనని పట్టణవాసులు చెబుతున్నారు. బ్యాంకుకాలనీ, రెవెన్యూ, సర్వారాయ, సుధాకాలనీ, టీచర్స్‌కాలనీ, పీఅండ్‌టీ, నువ్వులగుంట, పాత ప్రభుత్వాసుపత్రి వీధి, కుమ్మరవీధి, మిరపకాయలవారివీధి, పద్మనాభకాలనీ, కొండయ్యపేట, క్రిస్టియన్‌పేట, రామారావుపేట తదితర ప్రాంతాల్లో ఏటా అక్టోబరు నుంచి ప్రారంభమై నుంచి నాలుగు నెలల పాటు పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పది రోజులుగా సమస్య తీవ్రమవుతోందని స్థానికులు అంటున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని వివరణ కోరగా ఏ కంపెనీ నుంచి వస్తుందో వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కంపెనీల నుంచి వచ్చిన నల్లటి రజను

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్: టమాటా - 36, వంకాయలు - 40,44,56, బెండకాయలు - 40, పచ్చిమిర్చి - 40,46, కాకరకాయ - 30, బీర - 36,42, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 44, క్యారెట్ - 44, దొండకాయలు - 25, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 36, ఆనబకాయ - 30,35, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 100, చేమదుంపలు - 40, మునగకాడలు - 6,7, బీట్‌రూట్ - 40, కీరదోస - 24, బీన్స్‌గింజలు - 130, అల్లం - 60, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 52, చిలకడదుంపలు - 34, మామిడికాయ - 15,18, నిమ్మకాయలు(డజన్) - 24,48,54.

నగరంలో సినిమాలు గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, విశ్వం, ఇద్దరు, జనక అయితేగనక, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- దిడీల్, విశ్వం, జిగ్రా, లక్ష్మీ- ఇద్దరు, సత్యగౌరి- లవ్‌రెడ్డి, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిఅండ్‌సీ 1- జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- వెట్టయాన్ ది హంటర్ (మ,రా)విశ్వం(ఉ,సా), శ్రీశ్రీనివాసా(వేళంగి)- విశ్వం.

మేమున్నాం.. మీకు తోడుగా

వ్యర్థాలు తొలగించారు



గాంధీనగర్ సాయిభావన అపార్ట్‌మెంట్ వద్ద చెట్ల కొమ్ములు, వ్యర్థాలు పేరుకుపోయాయి. చాలా రోజులుగా తొలగించడం లేదు. దీనిపై ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగపు అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తొలగించి, సమస్య పరిష్కరించారు.

వెలగని వీధి దీపం..



సమస్య: గొడారిగుంట లక్ష్మీనగర్ రోడ్ నెం.4లో 3-17-47-31/5 డోరు నంబరులో వీధి దీపం చాలా రోజులుగా వెలగట్లేదు. రాత్రిళ్లు చీకటి కారణంగా ఇబ్బందిగా ఉంటోంది.

– వై.ఉమామహేశ్వరరావు, గొడారిగుంట

ఖాళీ స్థలంతో ఇబ్బందులు..

సమస్య: కాకినాడ టూటౌన్ సమీపంలోని మునసబువారి వీధి సాయిబాబా గుడి వెనుక ఖాళీ స్థలం ఉంది. అందులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. సమీప ప్రాంత నివాసితులు చెత్త వేస్తున్నారు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. – శేఖర్, వ్యాపారి, టూటౌన్ ప్రాంతం

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –డా.పృథ్వీచరణ్, ఎంహెచ్‌ఓ, నగరపాలకసంస్థ

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: **91548 46719**

నగరంలో కేటుగాళ్లు

రెచ్చిపోతున్న ద్విచక్ర వాహన చోరులు

★ గతనెల 18న జీజీహెచ్‌లోని ఓ సీనియర్ అసిస్టెంట్ తన ద్విచక్రవాహనాన్ని ఆసుపత్రి ఆవరణలోని స్టాండ్‌లో పార్కు చేశారు. సాయంత్రం 5గంటలకు చూస్తే కనిపించలేదు. సీసీ కెమెరాల్లో చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసులు చెప్పగా వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

★ నెల క్రితం నగరానికి ఒకరు ఆసుపత్రిలో ఉన్న తన తల్లిని చూసేందుకు వెళ్లారు. సర్జికల్ వార్డు వద్ద బైక్ ఉంచాడు. టిఫిన్ తీసుకొద్దామని వెళ్తే బండి పోయింది. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ప్రస్తుత అవసరాల నేపథ్యంలో సగటు నగర జీవి బయటకు అడుగు పెడితే బండి ఉండాల్సిందే. బస్సులు, ఆటోలపై వెళ్లాలంటే ఖర్చు, ఎదురుచూపులు, శ్రమ. ద్విచక్రవాహనం ఉంటే చకచకా పనులు జరిగిపోతాయి. ఈరోజుల్లో ప్రతి ఇంటికీ కనీసం ఒక బండి అయినా ఉండటం సర్వసాధారణమైంది. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు సమస్య ఇక్కడే ఎదురవుతోంది. నగరంలో ద్విచక్రవాహనాలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. కాకినాడకు పరిసర గ్రామాల నుంచి రోజూ వేలమంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అధికారిక లెక్కల ప్రకారం రోజుకు ఒకటి పోతుంటే లెక్కల్లోకి రానివి ఇంకెన్నో ఉంటున్నాయి.

మన వెంటే ఉంటారు.. వ్యాపార, వాణిజ్య కూడళ్లు, ప్రధాన రహదారులు, ఆర్టీసీ బస్టాండ్, ఉద్యానాలు, రైల్వేస్టేషన్, ఆసుపత్రి సముదాయాలు వంటి బాగా రద్దీ ఉన్న ప్రాంతాల్లో చోరీల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. జనసంచారం లేని ప్రాంతాలు, రాత్రిపూట ఇంటి బయట ఉంచినవి తరచూ పోతున్నాయి. జీజీహెచ్‌కు రోజూ వేలమంది వస్తుంటారు. బండి ఆ పరిసరాల్లో ఉంచి, లోపలకు వెళ్తారు. అప్పటికే అక్కడ ఇద్దరు మాటు వేస్తారు. ఒకరు వాహనం దగ్గర ఉంటే, మరొకరు బండి యజమాని వెనకాలే ఉంటారు. ఆ వ్యక్తి వచ్చేలోగా మాయం చేస్తారు. కుదరకపోతే ఏమీ ఎరగనట్టు ఇద్దరూ జారుకుంటారు.

సంవత్సరం	చోరీకి గురైన వాహనాలు	రికవరీ చేసినవి
2022	341	257
2023	322	250
2024 ఇప్పటివరకు	157	55



జీజీహెచ్‌లో ఇటీవల దర్జాగా దొంగతనం

జల్సాల కోసం.. గతనెల 28న 20 వాహనాల చోరీలు ఇద్దర్ని అరెస్టు చేశారు. వారిద్దరూ గతంలో కూడా దొంగతనాల కేసులో పలుసార్లు అరెస్టు అయ్యారు. బయటకు వచ్చినా అదే పంథా కొనసాగిస్తున్నారు. జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. చదువు మధ్యలో ఆపేసి వ్యసనాలకు బానిసైన యువత చాలామంది జల్సాల కోసమే బండి దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

కొట్టేసి.. అమ్మేసి.. గతంలో మారు తాళాలతో చోరీ చేసేవారు. ఇప్పుడు వైఫ్ కలిపి కొట్టేస్తున్నారు. అందుకోసం శిక్షణ తీసుకుంటున్నారు. చాలామంది వాటిని అతి తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. కొంతమంది వాటిని విడి భాగాలుగా చేసి వేర్వేరు ప్రాంతాల్లో అధిక ధరకు అమ్ముకుంటున్నారు. బండి రకాన్ని బట్టి ధర ఉంటుంది.

చాలా ప్రమాదం.. బండి పోతే కొంతమంది ఫిర్యాదు చేయట్లేదు. అది ప్రమాదకరం. చోరీ చేసిన వాహనాన్ని గంజాయి, మాదకద్రవ్యాల తరలింపు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తే యజమానికి తలనొప్పులు తప్పవు. అదే ఫిర్యాదు చేస్తే దాన్ని రుజువుగా చూపించవచ్చు.



వందే వినాయకం

గాంధీనగర్: సంకటహర చతుర్థి సందర్భంగా స్వయంభూ భోగి గణపతి పీఠంలో 8వ చతుర్థి మాసోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. భోగి గణపతి పీఠంలో లక్ష గరిక పూజ చేశారు. పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడారు. 2026 మాఘమాసం వరకు పీఠంలో చతుర్థి మాసోత్సవాలను 24 నెలల పాటు ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఫోను ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు అదనపు కమిషనర్ సుధాకర్ తెలిపారు. 0884-2357800 నంబరుకు సమస్యలు చెప్పవచ్చునని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా నేరుగా వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఐఆర్ ప్రకటించాలని వినతి

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఉపాధ్యాయులకు సంబంధించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ డిమాండ్ చేసింది. ఈమేరకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బండి నూకరాజు తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. పీఆర్‌సీ 12వ నివేదిక వచ్చేలోపు 30శాతం తాత్కాలిక భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ పదాల ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

గాంధీనగర్: కోన విజయ భాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దంటు కళాక్షేత్రంలో జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, డాక్టర్ రావుల శ్రీరామ్, ముళ్లపూడి నాగేశ్వరరావు, మార్ని జానకిరామ్‌చౌదరి తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పలువురు మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవితాల్లో ఈ కార్యక్రమాలు ఆనందాన్ని కలగజేస్తాయన్నారు.



కబడ్డీలో సత్తాచాటిన క్రీడాకారులు

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మండపేటలో ఉత్కంఠంగా సాగాయి. ఈ సందర్భంగా సౌత్‌జోన్ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. సౌత్ జోన్ బృందానికి వీరు ఎంపికయ్యారు. పీర్దడేష్ (ప్రభుత్వ డిగ్రీకళాశాల, మండపేట), అడబాలామణికరాం (పీఆర్ డిగ్రీ కళాశాల, కాకినాడ), మల్లాడి శ్రీహరి (పీఆర్ డిగ్రీ కళాశాల,కాకినాడ), వాసుపల్లి దుర్గాప్రశాంత్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), పాలెపు హరీష్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), పొడుగు లోవబాబు (సిఎస్‌టిఎస్ కళాశాల, జంగారెడ్డి గూడెం), నల్లా నీలకుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట), గురజాపు సూర్య చంద్రశేఖర్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), బందారు అనిల్‌కుమార్ (ఐడియల్ కళాశాల, కాకినాడ), గాదా హరీష్ (నన్నయ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్, రాజమహేంద్రవరం), కేతా దిలీప్ (డిఎన్ఆర్ కళాశాల, భీమవరం) అదనపు ప్లేయర్లుగా: తాళ్లూరి విమలాకర్ (ఎస్‌సిఐఎం ప్రభుత్వ డిగ్రీకళాశాల, తణుకు), దమ్ము అఖిల్ (ఎస్‌కెవిటి ప్రభుత్వ డిగ్రీకళాశాల, రాజమహేంద్రవరం), లోచర్ల ఎంకార్ (ఎస్ఎస్ఆర్ కళాశాల గోపన్న పాలెం, పశ్చిమగోదావరి జిల్లా), బాదా రాహుల్ (ప్రభుత్వ డిగ్రీకళాశాల), రంపచోడవరం

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నియామకం

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) కార్యవర్గం నియామకం జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కలెక్టర్ షాన్‌మోహన్ ఛైర్మన్‌గా, నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కో-ఛైర్మన్‌గా నియమితులయ్యారు. సభ్యులుగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి, డీఎంఈ డా.నరసింహం, మున్సిపల్ కమిషనర్ భావన, ఏపీఎస్‌ఎంఐడీసీ ఈఈ రత్నరాజు, డీసీహెచ్‌ఎస్ డా.ఎస్.స్వప్న, డీఎంహెచ్‌వో డా.నరసింహనాయక్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, ఇతర విభాగాల్లో అమన్ జైన్, గంగారాజేష్, మేకా లక్ష్మణమూర్తి, బత్తిన విప్లవ్‌రాజు, సత్యగోపాల్ అక్షయ్, అడ్వకేట్ వి. ఉమామహేశ్వరి, డా.కె.సత్యనారాయణ నియమితులయ్యారు.

గోదావరి ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ



మసీదు సెంటర్: కాకినాడలో డిసెంబర్ 1 నుంచి 12 వరకు గోదావరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాకినాడలో మొట్టమొదటి సారిగా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహకుడు ఎస్.కరుణాకర్ మాట్లాడారు. డేవిడ్ కాకినాడ కింగ్స్, చిట్ల కిరణ్ పిఠాపురం పాంథర్స్, హరీష్ కోనసీమ లయన్స్, లోవస్ రామచంద్రపురం రాయల్స్, జీవీకే తుని డస్కస్, షణ్ముఖ్ గోదావరి రైడర్స్ తదితర జట్లు పోటీ పడతాయన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



మసీదు సెంటర్: అమలాపురంలో ఇటీవల జరిగిన అండర్-17 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ డీఎస్ఏ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. కోచ్ సత్తి నారాయణరావు (చిన్నారి) వద్ద శిక్షణ పొందుతున్న వై. రేణుకాదేవి, జి.కవిత, పి.లక్ష్మీహర్షిత రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈనెల 28న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వారిని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ అభినందించారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేత

మసీదు సెంటర్: హిందూపురంలో సోమవారం నుంచి జరగనున్న అండర్-17 వాలీబాల్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా జట్టు పయనమైంది. జట్టు ప్రయాణ ఖర్చుల నిమిత్తం అండర్-14, 17 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి వారికి ఆదివారం కాకినాడలో రూ.14 వేలు అందజేశారు. క్రీడా కిట్ కూడా అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ జి.సునీల్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

యువ స్వచ్ఛ సంకల్పం



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా కృషిచేయాలని కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బీవీ తిరుపాణ్యం అన్నారు. ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కళాశాలలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణతో పాటు నడకదారికి ఇరువైపులా సుమారు 150కిపైగా వేప మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆల్‌ఈజ్‌వెల్ సభ్యులతోపాటు పీఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ టీమ్, డా. విష్ణుమూర్తి, డా. శ్యామ్, హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్, అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, మసీదు సెంటర్

మెరుగైన సమాజానికి శాస్త్రీయ దృక్పథం



మాట్లాడుతున్న వేదిక వ్యవస్థాపక నాయకుడు బాలసుబ్రహ్మణ్యం

గాంధీనగర్: యువత శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలని ప్రజలు.. ప్రగతి.. పర్యావరణం కోసం సైన్స్ అనే నినాదంతో ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ, జవివే వ్యవస్థాపక నాయకుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఐడియల్ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కార్యకర్తలకు ప్రజాసైన్స్, ఉద్యమ తాత్వికతపై శిక్షణా తరగతులు నిర్వహించారు. తొలుత ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా చిత్రపటానికి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, రాష్ట్ర ప్యాట్రన్ డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి తదితరులు నివాళులర్పించారు. జవివే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ సమాజాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు యువత ముందుకు రావాలన్నారు. రిసోర్స్ పర్సన్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువత సైన్స్ ఫలాలు అందుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరడం ద్వారా యువత సమాజంలో మార్పునకు కృషి చేయాలన్నారు. తాత్వికత, తార్కిక, భౌతికవాద ఆలోచనలు పెంపొందించుకోవాలన్నారు.

రోటరీ సేవాపథం

గాంధీనగర్, న్యూస్‌టుడే: వ్యక్తి చేయలేని ఎన్నో పనులకు రోటరీ ఫౌండేషన్ ద్వారా చేయవచ్చని రోటరీ ఫౌండేషన్ ట్రస్టీ భరత్ పాండ్య అన్నారు. ఆదివారం సూర్యకళామందిరంలో రోటరీక్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో విశ్వాసం పేరిట ది రోటరీ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ సెమినార్ జరిగింది. కార్యక్రమానికి రోటరీ క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ పోలిశెట్టి ఈశ్వరరావు అధ్యక్షత వహించారు. రోటరీ ఫౌండేషన్ ట్రస్టీ భరత్ పాండ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అతిథులుగా ఆర్ఆర్ఎఫ్‌సి మంజునాథ్‌శెట్టి, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, తాడాల బుజ్జీ, భాస్కర్రామ్, దత్తా సుబ్బారావు, ఆంజనేయమూర్తి, టిక్కు తదితరులు పాల్గొన్నారు.



రోటరీ ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ సదస్సులో ప్రముఖులు

చర్చి అడ్‌హక్ కమిటీ రద్దు



వెల్లడిస్తున్న సునీల్‌కుమార్

కాకినాడ కలెక్టరేట్: స్థానిక జగన్నాథపురంలోని సెంటినరీ ఆంధ్రా బాప్టిస్టు చర్చి అడ్‌హక్ కమిటీని రద్దు చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.సునీల్‌కుమార్ చర్చిని సందర్శించి, రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సభ్యులకు తెలియజేశారు. అడ్‌హక్ కమిటీని రద్దు చేసినట్లు కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ఆర్డీవో ఆదేశాల మేరకు ఈ ప్రకటన చేస్తున్నట్లు తెలిపారు. సభ్యులంతా సమష్టిగా ఏర్పడి అరమరికలు లేకుండా కమిటీ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. శాంతియుతంగా కార్యకలాపాలు సాగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై దాడి

నారాయణవనం: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై గ్రామస్థులు దాడి చేసిన సంఘటన చిత్తూరు జిల్లా నారాయణవనం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. కాకినాడకు చెందిన బాలు మండలంలోని వీకేపాలెం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దొంగ అనే అనుమానంతో స్థానికులు అతన్ని పట్టుకొని కొట్టి పోలీసులకు అప్పగించారు. వేలూరు గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ చెరుకు తోటలో పనిచేయడానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండగా పోలీసులకు అప్పజెప్పారు. ఇతనికి మానసిక స్థితి సరిగా లేక నాలుగు రోజులు ముందు ఇంటి నుంచి వచ్చినట్లు అతని బంధువులు తెలిపారని పేర్కొన్నారు.

బాలమందిరంలో 'ఓరిగామి ఆటవిడుపు'

గాంధీనగర్, న్యూస్‌టుడే: బాలమందిరంలో కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆటవిడుపుగా ఓరిగామిపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్‌పర్సన్ సత్యవేణి చిన్నారులకు కాగితంతో ఆకృతులు, ఫొటోఫ్రేమ్, పుష్పగుచ్ఛాలు, పక్షులు, జంతువుల చిత్రాలు వంటి వాటిని ఎలా చేయాలో నేర్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆర్ఎస్ఆర్ గ్రూప్ సంస్థ వ్యవస్థాపకుడు రంకిరెడ్డి సుబ్బరాజు అందజేసిన బహుమతులను అందజేశారు. బాలమందిర నిర్వాహకులు కృష్ణశ్రీ చేతులమీదుగా బాలల సభలో కథలు చదవడం, చెప్పడం, బాల సాహిత్య పుస్తకాలపై సమీక్ష వంటి అంశాల్లో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న సత్యవేణిని సత్కరించారు.

దయచేసి చూడండి..

పరిసరాలు పట్టించుకోండి

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ ప్రాంగణం, పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ నుంచి నిత్యం సుమారు రెండు వేల ప్రయాణికులు వివిధ రైళ్లల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాం గోడను ఆనుకుని ఉన్న ప్రహరీ ప్రాంతం తుప్పలు, పొదలతో అడవిని తలపిస్తోంది. చెత్తాచెదారంతోపాటు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాములు, తేళ్లు, విష కీటకాలకు నిలయంగా మారింది. వర్షం పడినప్పుడు అందులోంచి పాములు, ఇతర కీటకాలు రోడ్లపైకి వస్తున్నాయని రాకపోకలు సాగించేవారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి సమీప ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఇళ్లలోకి వెళ్తున్నాయి. గతంలో రైల్వే ఆవరణను అందంగా తీర్చిదిద్దేలా పలురకాల మొక్కలు నాటారు. వాటి రక్షణకు ఇనుప గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. సరైన నిర్వహణ లేకపోవడంతో రక్షణగా ఏర్పాటుచేసిన ఇనుప గ్రిల్స్ శిథిలమయ్యాయి. కొన్ని ఊడి రోడ్డుపై పడిపోయాయి. మరోవైపు స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పాత ప్లాట్‌ఫాంపై తొలగించిన సిమెంటు పలకలను స్టేషన్‌కు వచ్చే దారిలో పడేశారు. మూడో ప్లాట్‌ఫాం భానుగుడి ప్రాంతం వైపు ఆవరణ వర్షం పడితే ముంపునకు గురవుతోంది. అటువైపు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితమే ఆవరణను మెరక చేసి అభివృద్ధి చేశారు. కొద్ది కాలానికే ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం.



పడిపోయిన మొక్కల రక్షణ గ్రిల్



రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫాం వద్ద పొదలు

చర్యలు తీసుకోవాలి..

టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి ప్రాంతం మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఫ్లైఓవర్ దిగువన ట్రాక్ ఆనుకుని వ్యర్థాలను పడేస్తున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోంది. ఇక ప్లాట్‌ఫాం ఆనుకునే పోస్టాఫీసు ఉండటంతో పొదల్లోంచి పాములు కార్యాలయంలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- దూసర్లపూడి రమణరాజు, పౌర సంఘం కన్వీనర్

బాలగోపాల్ కృషి అసామాన్యం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉద్యమకారుడు బాలగోపాల్ కృషి అసామాన్యమని, రాజ్యాంగ విలువల పరిరక్షణకు అంకితభావంతో కృషిచేశారని ప్రముఖ న్యాయవాది, ఆదివాసీ హక్కుల కార్యకర్త పల్లా త్రినాధరావు పేర్కొన్నారు. డా. కె.బాలగోపాల్ సంస్మరణలో భాగంగా ఉమ్మడి జిల్లా 8వ మహాసభ ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీనగర్‌లో జరిగింది. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆక్బాల్ అధ్యక్షతన జరిగిన సభలో పల్లా త్రినాధరావు ప్రధాన వక్తగా మాట్లాడారు. న్యాయవాదిగా, విద్యావేత్తగా, రచయితగా, మానవ హక్కుల కార్యకర్తగా అనేక సమస్యలపై అధ్యయనంతో పాటు, వాటి పరిష్కారానికి బాలగోపాల్ పోరాటం చేశారని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త, మానవ హక్కుల కార్యకర్త కె.అనురాధ 'పర్యావరణ సంక్షోభం-దుష్ప్రభావాలు' అనే అంశంపై మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు కార్యదర్శి నివేదికను సమర్పించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ ఇక్బాల్, ప్రధాన కార్యదర్శిగా నామాడి శ్రీధర్, ముత్యాల శ్రీనివాసరావు, పి.పవన్, ఎల్‌బీఎస్ నారాయణ, గౌరవ్, కె.పుష్పవల్లి, జె.బాలసుందరం, అంబటి అశోక్‌కుమార్, ఎం.శ్రీనివాస్ తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఇరుకు మార్గంలో ఇష్టారీతిన రాకపోకలు



గాంధీనగర్ రైతుబజారుకు సమీపంలోని చీడీలపొర ప్రధాన మురుగుకాలువకు ఆనుకుని ఉన్న రహదారి అధ్వానంగా ఉంది. 2005లో కాలువలో పూడిక తొలగింపు నిమిత్తం దీన్ని నిర్మించారు. దీనికి ఆనుకుని పదుల సంఖ్యలో కుటుంబాలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. ఇంత చిన్న రహదారిలో వాహనాల తాకిడితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ రైతుబజారు, చేపల మార్కెట్ ఉండటంతో ఇటుగా వాహనాలు వస్తున్నాయి. ప్రత్యామ్నాయంగా ప్రధాన రహదారి ఉన్నా.. ఇటుగానే వాహనాలు వెళుతున్నాయి. కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, ఇతర వాహనాలు ఇటుగా రాకపోకలు సాగించకుండా గడ్డర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కావట్లేదని వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

చినుకుపడితే చెరువే

నగరంలో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నీరు నిలిచి, చెరువును తలపిస్తోంది. తరగతులు మారే సమయంలో పలు విభాగాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడిచే మార్గం ఎత్తు చేస్తే సమస్య కొంత పరిష్కారం అవుతుందని అంటున్నారు. ఇదే ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయం, ఆర్టీవో డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ట్రయల్ రన్ ప్రదేశాలు వర్షం పడితే మునిగిపోతున్నాయి. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్



కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణం

27న 'నిధుల సేకరణ'

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రాణాంతక వ్యాధిగ్రస్త చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు లయన్స్‌క్లబ్ సంకల్ప్‌చే ట్రెజర్ హంట్ పేరుతో నిధుల సేకరణకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం అభినందనీయమని లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ, జిల్లా గవర్నర్ ఈశ్వర్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఆదివారం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ క్లీనికల్ ల్యాబ్ ప్రాంగణంలో 27న లయన్స్‌క్లబ్ సంకల్ప్‌చే నిర్వహించనున్న ట్రెజర్ హంట్ గోడప్రతులను బాదం బాలకృష్ణ, ఈశ్వర్‌కుమార్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ చిన్నారుల పోషకాహారం కోసం క్లబ్ కృషి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో చిట్నీడి శ్రీనివాసు, ఎస్.లక్ష్మీలావణ్య, పున్నమరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం



పుష్పగుచ్ఛం ఇస్తున్న అనంతలక్ష్మి తదితరులు

మంత్రి నారాయణను కలిసిన మాజీ ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్: విజయవాడలోని కార్యాలయంలో మున్సిపల్‌శాఖ, కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పి.నారాయణను మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, తెదేపా కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి తదితరులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మాజీ జడ్పీటీసీ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వేషధారణలు

గొల్లప్రోలు, సామర్లకోట: గొల్లప్రోలులో పూల రథంపై కనకదుర్గమ్మ ఊరేగింపు ఆకట్టుకుంది. దేవతామూర్తుల వేషధారణలు అలరించాయి. కరణంగారితోట కనకదుర్గ ఆలయం నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ప్రదర్శన చేశారు. 20పీడీపీ47 ప్రత్యేక వాహనం మండపంలో అమ్మవారు. ✦ మాసరమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఉత్సవ కమిటీ నాయకులు, యాదవ సంఘ నాయకులు నమ్మి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టరుపై యమధర్మరాజు, చిత్రగుప్తుడుగా

ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసే వరకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చమురు సంస్థలు ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసే వరకు సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ అన్నారు. తాళ్లరేవు ప్రజా సంఘాల కార్యాలయంలో పార్టీ ఆరు గ్రామాల శాఖల మహాసభ ఆదివారం పార్టీ నాయకుడు వల్లు రాజుబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి అతిథులుగా సీపీఎం జిల్లా కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ, కమిడి సత్య శ్రీనివాస్ హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడారు. గాడిమొగ, పి.మల్లవరం గ్రామాల్లో చమురు సంస్థ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. మూడేళ్ల పాటు నిర్వహించిన ప్రజా ఉద్యమాలపై టేకుమూడి ఈశ్వరరావు నివేదికను ప్రవేశపెట్టారు. పార్టీ మండల కన్వీనర్‌గా టేకుమూడి ఈశ్వరరావును తిరిగి ఎన్నుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్త తొలగించారు

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:	
కాకినాడ గ్రామీణం:	80085 74325
పెద్దాపురం:	80085 74198
పిఠాపురం:	80085 65544

సమస్య: ఎ.విజయనగరం శివారున రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయి పరిసర ప్రాంతాల ప్రజలు, ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - జి.శ్రీను, ఎ.విజయనగరం

పరిష్కారం: సమస్యను ఈవోపీఆర్డీ కుమార్‌కు తెలుపగా.. చెత్తను తొలగించే పనులను పొక్లెయిన్‌తో చేపట్టారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచారు. - న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గోదావరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు సన్నాహాలు



లోగో ఆవిష్కరిస్తున్న నానాజీ తదితరులు

సర్పవరం జంక్షన్, కరప: కాకినాడలో డిసెంబరు 1 నుంచి 12వ తేదీ వరకు యాంప్లిఫై స్పోర్ట్స్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆరు టీమ్‌లతో గోదావరి ప్రీమియర్ 20-20 క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనుండడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. కాకినాడలో ఆదివారం లోగోను ఆవిష్కరించారు. డా.కిరణ్, పట్టాభి, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి..: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. కొరిపల్లి, జడ్.భావారం, గొడ్డటిపాలెం, వలసపాకల, వేములవాడ గ్రామాల్లో ఆదివారం ఆయన పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. రామచంద్రరావు, శ్రీనివాసబాబా, వెంకటేశ్వరరావు, అనుపమ, రమణకుమార్, మురళి, గంగాధర్, కొండబాబు, ముత్యాలరావు పాల్గొన్నారు.

వానొస్తే వణుకు.. ఉపాధికి కునుకు..

– న్యూస్‌టుడే, సర్పవరం (సర్పవరం జంక్షన్)

సర్పవరం పరిధిలోని ఏపీఐఐసీ, ఆటోనగర్‌లో ఆటోగ్యారేజీల యజమానులు, కార్మికులు ఏటా సమస్యలతో సతమతమవుతున్నారు. కాకినాడ నగరంలోని ఘాటీసెంటర్, సాంబమూర్తినగర్, దూదిమిల్లు, వార్ఫ్‌రోడ్డు తదితర ప్రాంతాలు ఆటోగ్యారేజీలకు వచ్చే వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఏపీఐఐసీ ఆధ్వర్యాన సర్పవరంలో 52 ఎకరాల్లో ఆటోనగర్‌ను రహదారులు, విద్యుత్తు, మురుగు కాలువల సౌకర్యం కల్పించి ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరం మార్చి 27న ఇక్కడ 300 గ్యారేజీ యూనిట్‌లు ప్రారంభమయ్యాయి.

వరదొస్తే వణుకే..

ఆటోనగర్ తక్కువ ఎత్తులో ఉండడం, సౌకర్యా లేకపోవడంతో ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటితో మునుగుతోంది. దాంతో ఇక్కడి మూడు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అవసరార్థం వచ్చే వాహనదారులూ యాతనపడుతున్నారు. ఈ ఏడాది రెండు నెలల్లో మూడుసార్లు ఆటోనగర్ మునకకు గురైంది. ఏపీఐఐసీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని అక్కడివారు వాపోతున్నారు. ఇటీవల సమస్య పరిష్కారం కోరుతూ కార్మికులు ఆందోళన నిర్వహించగా.. సమస్యలను కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఐఐసీ జీఎం రమణారెడ్డి చెప్పారు.



ఆటోనగర్‌లో ముంపు ప్రాంతాలు చూపుతున్న కార్మికులు

అప్పుడు మాకు పని దొరకదు..



ఏటా నెలలపాటు ముంపుతో మాకు పని దొరక్క పస్తులుండే పరిస్థితి నెలకొంటుంది. అవసరాలకు అప్పు చేయాల్సివస్తోంది. అసలే దూర ప్రాంతాల నుంచి వచ్చి ఉపాధి పొందుతున్నాం. ఏడాదంతా పనులుంటేనే నాలుగురాళ్లు సంపాదించుకునేది.

- చింతా ప్రభుదాసు, కార్మికుడు

24 ఏళ్లుగా ఇబ్బందులు

సర్పవరం ఆటోనగర్‌లో 24 ఏళ్లుగా ముంపు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. వరదలకు రూ.లక్షల విలువైన యంత్ర సామగ్రి పాడైపోతోంది. వాహనాలు మరమ్మతులకు రాకపోవడంతో చాలావరకు షెడ్లు మూతపడుతున్నాయి. కలెక్టర్, ఏపీఐఐసీ అధికారుల చుట్టూ పరిష్కారం చూపాలని తిరుగుతున్నాం. ప్రధాన రహదారి ఎత్తు చేశారు. మిగిలిన దారులూ అలాగే నిర్మించి, మురుగునీరు బయటకుపోయే మార్గాలు ఏర్పాటు చేయాలి.

- గరగ సత్తిబాబు, అసోసియేషన్

బాధితులకు టైలర్ల సాయం

గొల్లప్రోలు: విజయవాడలోని వరద బాధితులకు గొల్లప్రోలు శ్రీజైగణేశా టైలర్స్ ప్రాథమిక సహకార సంఘ ప్రతినిధులు రాష్ట్ర టైలర్స్ సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జునరావుకు రూ.6,760 అందజేశారు. కొండలరావు, రాజు, పాపారావు, రాము పాల్గొన్నారు.

దుర్గాడలో ట్రాక్టరు స్వాధీనం

గొల్లప్రోలు: దుర్గాడలో అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టరును రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనపరుచుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వీఆర్వో అనంతలక్ష్మి తెలిపారు.

విద్యుత్తుకు అంతరాయం నేడు

పిఠాపురం, పెద్దాపురం: పిఠాపురం ఉపకేంద్రం పరిధిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్తుకు అంతరాయం ఉంటుందని ఈఈ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. దత్తాత్రేయుడిగుడి, కుమ్మరివీధి, హార్వెస్టు స్కూల్, తారకరామానగర్, వైఎస్సార్‌గార్డెన్, బీఎస్ఆర్ గార్డెన్, మాధవపురం రోడ్డు, బొజ్జవారితోట, లయన్స్ క్లబ్ ఏరియా, అన్నపూర్ణ థియేటర్, రెడ్డిగారి మెస్, మాధవనగర్ మసీదు ఏరియా, సాయిదత్త నగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎల్ఐసీ ఆఫీసు, రామా థియేటర్ సెంటర్, డ్రైవర్స్‌కాలనీ, మోహన్‌నగర్, అయితేనగర్, కొత్త కొంపలు, టిడ్కో ఇళ్లు, గోర్సరోడ్డు, రెడ్డిరాజా రైస్‌మిల్లు ప్రాంతాలవారు సహకరించాలని కోరారు. ✦ చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మర్లావ, తూర్పుపాకలు తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

అభివృద్ధి కమిటీ ఎన్నిక

సామర్లకోట: ఇస్మాయిల్‌నగర్ అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా వేణుగోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఏడుకొండలు, కోశాధికారిగా సుధాకర్ తదితరులు ఎన్నికయ్యారు. పద్మలత, జిలానీ, వెంకటరెడ్డి, దుర్గారావు, అప్పలరాజు, శివశంకర్, వైకుంఠం, చౌదరి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోంది

పిఠాపురం: కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించే పాలన అందిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆదివారం పిఠాపురం తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి, అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారన్నారు. వాటికి అనుగుణంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు పల్లెపండగ పేరుతో శంకుస్థాపనలు చేశామన్నారు. నాణ్యతాప్రమాణాలతో జనవరి నాటికే ఈ పనులు పూర్తవుతాయన్నారు. 2014-19లో అప్పట్లో 70 శాతం గ్రామీణ రోడ్లు నిర్మించామన్నారు. త్వరలోనే పండూరు-కొత్తపల్లి, నరసింగపురం, వన్నెపూడి గ్రామల మధ్య ర.భ.శాఖ రహదారుల నిర్మాణాలు చేపడతామన్నారు. గతంలో ఎన్నో నిధులు మంజూరు చేస్తే మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలైన వంగా గీత, దొరబాబు అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ చొరవతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

సామర్లకోట గ్రామీణం: ఎమ్మెల్యే చినరాజప్ప వేట్లపాలెం, చెల్లాయమ్మపేటలో, జొన్నలదొడ్డిలో సిమెంటు రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. సత్తిబాబు, రామకృష్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పల్లె పండగతో ప్రజాసమస్యల పరిష్కారం

కాజులూరు, న్యూస్‌టుడే: పల్లె పండుగతో ప్రజాసమస్యల పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండలంలోని కోలంక, ఆర్యవటం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అయిదేళ్ల వైకాపా ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. కనీస అవసరాలు తీర్చకుండా పబ్బం గడిపిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కాజులూరు మండలంలో రూ.3 34 కోట్లతో రహదారుల నిర్మాణాలకు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేది వరకు శంకుస్థాపనలు చేసి పనుల ప్రారంభించడం జరుగుతుందన్నారు. కోలంక గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా రూ.16 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి వాశంశెట్టి సుభాష్

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి

కరప, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా లయన్స్‌క్లబ్ సేవలందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని లయన్ డా.బొండా వెంకన్నరావు పేర్కొన్నారు. కరప మండలం వేళంగిలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహం, రక్తపోటు తదితరాలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేసి జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది బాధితులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అధ్యక్షుడు చంద్రు వెంకన్నరాయ్‌చౌదరి, భాస్కర రామారావు, పాతూరి శ్రీహరి, రాజేంద్ర, ఆదేశ్, డా.భీమాల దుర్గాప్రసాద్, డా.బొండా సూర్యారావు, డా.బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత.. రక్షిత నీరు వృథా



చినజగ్గంపేటలో వీధి కుళాయిలు నాచుపట్టి అపరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు రక్షిత నీరు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుళాయికి మూతలేక రక్షిత నీరు వృథాగా పోతోంది. కుళాయి వద్ద శుభ్రపరిచి, మూతలేసి నీరు పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీని గురించి అడుగగా చర్యలు చేపడతామని ఈవోపీఆర్డీ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పొడుచుకొచ్చిన పిచ్చిమొక్కలు

పట్టణంలోని సుధాకాలనీ, న్యూబ్యాంకుకాలనీ ప్రాంతాల్లో ప్రధాన రహదారులను పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. ఆయా మార్గాల్లో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. లెక్చరర్స్‌కాలనీ, సర్వారాయకాలనీ, పీఅండ్‌టీ, బ్యాంకుకాలనీ, టీచర్స్‌కాలనీ, రెవెన్యూకాలనీ తదితర అభివృద్ధి కాలనీల్లో ఖాళీ స్థలాలు కొనుగోలు చేసిన పలువురు యజమానులు వాటిని అలాగే వదిలేయడంతో అందులో పిచ్చిమొక్కలు గుబురుగా పెరిగిపోయాయి. వాటిలోకి విష పురుగులు, సర్పాలు చేరి రాత్రివేళతో పాటు పగలూ రోడ్డెక్కుతున్నాయి. ✦ ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని వివరణ కోరగా రహదారులపైకి వచ్చిన పిచ్చిమొక్కలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగిస్తామని చెప్పారు. ఎవరైతే ఖాళీ స్థలాలను పట్టించుకోకుండా వృథాగా వదిలేశారో అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామని వివరించారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం



సైబర్ నేరాలపై అప్రమత్తం



సర్పవరం జంక్షన్: రోజురోజుకూ పెరుగుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సీఐ పెద్దిరాజు సూచించారు. కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్‌లోని బోటు క్లబ్ ఉద్యానంలో ఆదివారం సీఐ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం జరిగింది. వాకర్స్ సంఘం అధ్యక్షుడు రత్నప్రసాదరావు, కార్యదర్శి కిరణ్, రామారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



ఉద్యోగులను సత్కరించిన పీసీఈడబ్ల్యూఏ ప్రతినిధులు

గొల్లప్రోలు: పిఠాపురం నియోజకవర్గ స్థాయిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా, సంఘ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు పిఠాపురం నియోజకవర్గ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చామంతి నాగేశ్వరరావు తెలిపారు. గొల్లప్రోలులో నియోజకవర్గ స్థాయిలో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించి అవార్డులు పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇటీవల పదవీ విరమణ పొందిన 16 మందిని సత్కరించారు. జీఎస్టీ ఏసీ నూకరాజు, బాబూరావు, రమేష్, ప్రసాద్, పుష్యమికీర్తి, రవీంద్ర, శ్రీనివాస్, సీతారామరాజు, మూర్తి, పార్థసారథి పాల్గొన్నారు.

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి

సామర్లకోట, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా బాణసంచా తయారుచేసేవారు నిబంధనలు పాటించాలని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సూచించారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతిపొందిన తయారీదారులే మందుగుండు సామగ్రి తయారుచేయాలని చెప్పారు. అనుమతులు లేనివారు తయారుచేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జ్వరంతో అయిదేళ్ల చిన్నారి మృతి

సామర్లకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న అయిదేళ్ల చిన్నారి ఆదివారం మృతిచెందింది. బంధువుల వివరాల ప్రకారం.. చిన్నవీధికి చెందిన పల్లవి (5)కి జ్వరం రావడంతో అయిదు రోజులుగా స్థానిక వైద్యుల వద్ద చికిత్స చేయించారు. ఆదివారం జ్వరం తీవ్రంకావడంతో కుటుంబ సభ్యులు సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం ఆక్సిజన్ అందిస్తూ మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని చెప్పడంతో బంధువులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆ వాహనం వచ్చేలోపే చిన్నారి మృతిచెందింది. ఒక్కగానొక్క కుమార్తె మృతితో తల్లిదండ్రులు, బంధువులు దుఃఖ సముద్రంలో మునిగిపోయారు.

గుండెపోటుతో యువకుడి..

సామర్లకోట: సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన యువకుడు ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం.. ఆటో నడుపుతూ కుటుంబానికి అండగా ఉంటున్న గండేపల్లి సాయికృష్ణ (20) ఆదివారం గుండెలో నొప్పిగా ఉందని చెప్పాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.

తెదేపా నాయకుల చొరవతో దారికి మరమ్మతులు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని హుస్సేన్‌పురం నుంచి పి.బి.దేవం వరకు కెనాల్‌రోడ్డులో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. జిల్లా తెదేపా రైతు విభాగం అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు ఆధ్వర్యంలో పి.బి.దేవం, జి.మేడపాడు వరకు గుంతలను పూడ్చివేశారు. కెనాల్‌రోడ్డులో ప్రయాణికుల ఇబ్బందులు దృష్టికిలో ఉంచుకుని జి.మేడపాడు నుంచి వేట్లపాలెం, హుస్సేన్‌పురం వరకు మార్గంలోని గుంతలను సరిచేశారు. దాదాపు 16 కిలోమీటర్ల పొడవైన రోడ్డులో రూ.10 లక్షల వ్యయంతో గుంతలు పూడ్చే పనులు చేపట్టామని మరో అయిదు రోజుల పాటు పనులు చేస్తామని శ్రీనుబాబు తెలిపారు. పనులను పెద్దాపురం ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ పరిశీలించి నాయకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, చల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న రంగనాగ్

డిసెంబరు 1న కాపు కార్తిక సమారాధన



కాకినాడలో మాట్లాడుతున్న ఏసుదాసు తదితరులు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో డిసెంబరు 1న కాపు సద్భావన సంఘం కార్తిక సమారాధన నిర్వహిస్తున్నామని, ఆ రోజు రాష్ట్రంలోని కాపు ప్రజాప్రతినిధులైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తామని ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు తెలిపారు. కాకినాడలోని కాపు కల్యాణ మండపంలో ఆదివారం ఏసుదాసు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభాకరరావు, ప్రతినిధులు పట్టాభి రామయ్య, సీతయ్యదొర, నూకరాజు, శ్రీనివాస్, ఉమేష్ పాల్గొన్నారు.

సైన్స్ సెంటర్ సేవలు వినియోగించుకోండి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రాజాసూరిబాబురాజు

పెద్దాపురం: ప్రయోగాల ద్వారా విద్యార్థులు సైన్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో ఏసీటీ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేశారని, కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు పేర్కొన్నారు. ఏసీటీ సైన్స్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవ సభను ఆదివారం రామారావుపేటలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజాసూరిబాబురాజు మాట్లాడారు. సభలో క్రియా సంస్థ (కాకినాడ) కార్యదర్శి జగన్నాథం, సంస్థ నిర్వాహకుడు బుద్ధా శ్రీనివాసు, ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు అపరంజీ, దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రయోగాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆలయాభివృద్ధికి భక్తుల సహకారం

పిఠాపురం: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాభివృద్ధికి భక్తులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రధాన అర్చకుడు విజయ జనార్ధనాచార్యులు తెలిపారు. ఆదివారం ఆలయానికి స్థానిక పెండ్యాల వెంకటాచలపతిరావు కుమారుడు నాగ సోమసాయికుమార్ బీరువా బహూకరించారు. ఆయన్ను సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు చెరుకుపల్లి శ్రీరామ్‌మోహన్, విజమూరి కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర దారులు.. ప్రయాణికుల బెంబేలు

– న్యూస్‌టుడే, కరప

రహదారులు రోజురోజుకూ అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు హడలిపోతున్నారు. రాళ్లు లేచి అడుగు లోతు గుంతలు పడి అధ్వానంగా తయారైనా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కరప నుంచి కొరిపల్లి వెళ్లే దారిలో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్డు ప్రస్తుత వర్షాలకు మరింతగా దెబ్బతింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతోపాటు పంచాయతీ పాలకులు, అధికారులు కనీసం కచ్చా డ్రెయిన్ తీయకపోవడంతో రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పట్టించుకునేవారే కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

✦ గొర్రిపూడి-జి.వేమవరం వెళ్లే దారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రాళ్లు లేచి అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ మార్గాల్లో ప్రతి రోజు పాఠశాలలకు విద్యార్థులు సైకిళ్లు, ఆటోల్లో వెళ్తుంటారు. ఈ దారి గతుకులమయంగా ఉండటంతో రాకపోకలు సాగించాలంటేనే హడలిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ దారుల్లో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా.. ప్రమాదం తప్పదని వాహనాల చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కరప-కొరిపల్లి దారిలో వర్షపు నీరు



గొర్రిపూడి-జి.వేమవరం మార్గంలో గుంతలతో అధ్వానం

చర్యలు తీసుకుంటాం

కరప నుంచి అరట్లకట్ట వెళ్లే రహదారికి నిధుల విడుదలలో జాప్యంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. గొర్రిపూడి నుంచి జి.వేమవరం వెళ్లే దారిదీ ఇదే పరిస్థితి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతాం.

- వర్మ, డీఈఈ, ర.భ.శాఖ



నెట్ కోర్టులో వాలీబాల్ ఆడుతున్న యువకులు

కొండల్లో ఇలా 'నెట్' వేశారు!

ప్రత్తిపాడు: గ్రామీణ యువతకు కబడ్డీతో పాటు ఇష్టమైన ఆట వాలీబాల్! నాలుగు ఇళ్ల మధ్య జాగా ఉన్నా, విశాలమైన మైదానం కనిపించినా ఇలా నెట్‌తో ఆటకు సై అంటారు. పండగలు, ఉత్సవాలు, ప్రత్యేక సందర్భాలు ఉంటే.. నాలుగూళ్ల ఆటగాళ్ల కుర్రాళ్లతో సై అంటే సై అంటారు. ప్రతి ఆదివారం వీరికి అంతర్‌గ్రామీణ పోటీలు జరుగుతూనే ఉంటాయి. ఉపప్రణాళిక మన్యంలోని ఇ.గోకవరం గ్రామంలోనిది. బంతి ఎలా ఆడినా దగ్గరలోనే ఉండేలా ఇలా నెట్ వేశారన్నమాట!

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఘనంగా సత్యదేవుని రథసేవ

అన్నవరం : అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు చేశారు. సహాయ కమిషనర్ సిహెచ్ రామ్మోహనరావు టెంకాయ కొట్టి రథసేవను ప్రారంభించారు. తూర్పురాజగోపురం ప్రాంగణం నుంచి వ్రత మండపాలు, నిత్య కల్యాణమండపం మీదుగా ఆలయ ప్రాకారం చుట్టూ మూడు సార్లు సేవ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు →



గ్రామాభివృద్ధే కూటమి లక్ష్యం

రౌతులపూడి, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన 'పల్లె పండగ'లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రౌతులపూడి మండలంలో ఎన్.ఎన్.పట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, పారుపాక గ్రామాల్లో, ప్రత్తిపాడు మండలంలో గజ్జనపూడి, శరభవరం, ఒమ్మంగి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ చేశారు. గ్రామాలకు పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా పనులను గుర్తించామని, త్వరలోనే పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు, స్థానిక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



'పల్లె పండగ'లో ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు



కొడదలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

తొండంగి: కొడద పంచాయతీలో ఉపాధి హామీ నిధులు రూ. 24 లక్షలతో సీసీ రహదారులు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెదేపా నాయకుడు యనమల రాజేష్ అన్నారు. ఆదివారం గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణానికి తెదేపా నాయకులు కొయ్యా కేశవ, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్, బుర్రి సింహాచలం, తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు.

జగ్గంపేటలో నేడు పల్లె పండగ

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేటలోని నాలుగు సచివాలయాల పరిధిలో సోమవారం పల్లెపండగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జగ్గంపేట ఇన్‌ఛార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. జగ్గంపేట కాకినాడ రోడ్డులోని సచివాలయం-1, గోకవరం రోడ్డులోని సచివాలయం-2, టవర్‌కాలనీలోని సచివాలయం-3, సీతానగరంలోని సచివాలయం-4 పరిధిలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే నెహ్రూ,మండల అధికారులు పాల్గొననున్నారు.

గిరిజన గ్రామాల్లో సభ్యత్వ నమోదు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని బవురువాక తదితర గిరిజన గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు ఆదివారం జరిగింది. పార్టీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కించు జోగిరాజు, కిసాన్ మోర్చా మండల కమిటీ అధ్యక్షుడు నందా లోవరాజు తదితరులు సాధారణ సభ్యత్వాలను నమోదు చేశారు. భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై మారుమూల పల్లెల్లోనూ మద్దతు పెరుగుతోందన్నారు.



మండలంలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్ సుబ్బారెడ్డిసాగర్ అందాలు

సుందర సాగరం

పది వేల ఎకరాలకు సాగునీరు అందించే మధ్యతరహా సాగునీటి పథకంలో సుబ్బారెడ్డి సాగర్ మూడు నెలలుగా జలకళతో.. కొండల నడుమ చూపరులను ఆకట్టుకొంటోంది. 87 మీటర్ల నీటి సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ఆదివారం నాటికి 86.59 మీ. నీటిమట్టం ఉంది. ఈ ఏడాది ప్రాజెక్టు నుంచి నాలుగు సార్లు వరద నీరు విడుదలైంది. ఆగస్టు నుంచి ఆయకట్టుకు నీటిని వదులుతున్నా తరచూ కురుస్తున్న వర్షాలకు అవసరమైనపుడు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇ.గోకవరం సమీపంలోని పోతుకొండ, బండకొండలను కలుపుతూ కట్టిన ఈ ఆనకట్ట అన్ని వేళల్లోనూ చూడముచ్చటగా ఉంటుంది. ఎత్తైన కొండల మధ్య నిశ్చలంగా ఉండే జలాలు ఆకర్షణీయంగా ఉంటాయి. మండలంలోని ధారల వద్దకు వచ్చిన సందర్శకులు ఈ ప్రాజెక్టు చెంత ఫొటోలు దిగుతుంటారు.

\- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు





పి.అగ్రహారంలో పాఠశాల భవనం



దానవాయిపేటలో శిథిలమైన పాఠశాల భవనం

శిథిల భవనాలు.. పొంచి ఉన్న ప్రమాదం

తొండంగి, న్యూస్‌టుడే: ఏళ్లుగా పాఠశాల భవనాలు శిథిలమై ప్రమాదకరంగా, నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. దానవాయిపేట, పీఅగ్రహారం ప్రాథమిక పాఠశాలల ఆవరణలో పదేళ్ల నుంచి రెండు భవనాలు శిథిలమై ఏ సమయంలో కూలుతాయో అన్నట్లుగా ఉన్నాయి. పాఠశాల విరామ సమయాల్లో విద్యార్థులు ఈ శిథిల భవనాల వద్దే ఆటలు ఆడుతుంటారు. ఇటీవల తరచూ తుపాన్లు సంభవిస్తున్నాయి. దీంతో అవి తడిసి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. పదేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఏ ప్రమాదం చోటు చేసుకోకముందే అధికారులు స్పందించి శిథిల భవనాలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ శిథిల భవనాల సమస్యను ఎంఈవో-2 సుబ్బిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పరిస్థితులిలా.. సాగునీరు పారేదెలా

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఏలేరు వరద ప్రవాహం ఆధారిత రైతులను వెంటాడుతూనే ఉంది. కాలువలు, సాగునీటి నిర్మాణాలు ఛిద్రం కావడంతో ప్రస్తుత ఖరీఫ్ పంట గట్టెక్కే పరిస్థితి కనిపించడంలేదు. అత్యవసరంగా తాత్కాలిక పనులు చేపట్టేందుకు అక్కడి పరిస్థితులు సైతం అనుకూలంగా లేవు. దీంతో ఈనిక దశకు చేరుకున్న పంటలను రక్షించుకునేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు వీలుకుదిరిన చోట ప్రధాన కాలువలో ఇంజన్ పెట్టి నీరు తోడుకుంటున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే రబీ పంట వేసేందుకు సాగునీటి సంక్షోభం ఏర్పడనుంది.



ముక్కొల్లు రెగ్యులేటరు షట్టర్లు లేక..

కుడి.. ఎడమ కాలువలకు..

ముక్కొల్లు రెగ్యులేటరుపై కుడి, ఎడమ కాలువల ద్వారా ఆరువేల ఎకరాలకు సాగునీరు పారాల్సి ఉంది. రెగ్యులేటరును ఆనుకుని కుడివైపు ఉన్న మదుం కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ కాలువపై 200 ఎకరాలకు సాగునీరు పారాల్సిఉంది. కాలువ మొగలో ఉన్న నీటిని ఆదుపుచేసే షట్టరు వరదకు కొట్టుకుపోయింది. కాలువ గట్టుగా గతంలో వేసిన ఇసుక బస్తాలు, గట్టు కూడా కొట్టుకుపోయాయి. దీని వల్ల ఆ కాలువకు పారాల్సిన నీరు పక్కనే ఉన్న రాజుపాలెం వాలు కాలువ(వరదకాలువ)లోకి నీరు వృథాగా పోతోంది. ఎడమవైపు పుట్టా కొండయ్య కాలువ మొగ రెగ్యులేటకు కొద్ది దూరంలో ఉంది. దీని ద్వారా ముక్కొల్లుతో పాటు పిఠాపురం మండలం గోకాడ, రాపర్తి, రాయవరం గ్రామాల్లో సుమారు 5,800 ఎకరాలకు సాగునీరు పారాల్సి ఉంది. ఈ కాలువకు సక్రమంగా సాగునీరు పారడంలేదు. రెగ్యులేటరు వద్ద రాజుపాలెం వాలు కాలువ రెగ్యులేటరు మొత్తం కొట్టుకుపోయి ఛిద్రమై నీరు మొత్తం వరద కాలువకు పోతుంది. దీనిని అదుపుచేసే పరిస్థితి చేపట్టాల్సి ఉంది. నీటి ప్రవాహం తాత్కాలిక పనులకు తీవ్ర అవరోధంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ చేపట్టాల్సిన పనులపై జలవనరులశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆధారిత గ్రామాల రైతులు కోరుతున్నారు.



మొగ షట్టరు కొట్టుకుపోవడంతో బయటపడిన ఇసుక బస్తాలు

చర్యలు చేపడతాం..

ముక్కొల్లు రెగ్యులేటరు వద్ద తాత్కాలికంగా చేపట్టాల్సిన అత్యవసర పనులను గుర్తించాం. వరదల కారణంగా వాలు కాలువ, మదుం కాలువ మొగలో లోతైన గుంతలు పడ్డాయి. దీంతో పనులు చేపట్టేందుకు అవరోధంగా మారింది. నీటి విడుదలను నిలిపివేద్దామంటే ప్రస్తుతం పంటలకు సాగునీరు అవసరముంది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక చర్యలు చేపడతాం. **- శేషగిరిరావు, ఏఈఈ, ఏలేరు జలవనరులశాఖ, పెద్దాపురం**

నూతన ఆలయంలో పూజలు

జగ్గంపేట గ్రామీణం: రామవరంలో నూతనంగా నిర్మించిన సత్తెమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రా వెంకట్రావు-రాజ్యలక్ష్మి, వెంకటసోమినాయుడు-విశాలి దంపతుల సహకారంతో నిర్మించిన ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం గోపూజ, మండపాలకు పుణ్యాహవాచనం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, హోమాలు, పుష్పాధివాసం, శయ్యాధివాసం, నీరాజనమంత్రపుష్పాలు, చతుర్వేదాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ తేజోమూర్తుల జగదీశ్వరరావు, ముత్య వేణుగోపాలకృష్ణ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం భారీ అన్నదానం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.



రామవరంలో...

లోవకు భక్తుల తాకిడి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే : తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో నిండిపోయింది. ఏడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ. 3.27 లక్షలు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డీసీ విశ్వనాథరాజు తెలిపారు.



మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

దోమల నివారణకు చర్యలు

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలో శివాలయం పక్క వీధిలో చెత్త పేరుకుపోయి మురుగు కదలక దుర్వాసన వస్తోంది. సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు.

చేతిపంపు బాగుచేశారు..

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మన్యంవారిపాలెంలో గంగాలమ్మగుడి సమీపంలోని చేతిపంపు కొంత కాలంగా పనిచేయక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలువురు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. గ్రామసర్పంచి పోట్రు వీర్రాజుకు తెలియజేయగా సిబ్బందితో చేతిపంపునకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు.

వీధి దీపాలకు మరమ్మతులు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: జగపతినగరం గ్రామంలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు పగటిపూట వెలగడం, మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట వెలగక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితులపై గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యను సర్పంచి మహేంద్రాడ శ్రీలత దృష్టికి తీసుకెళ్లడంతో పంచాయతీ సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066



ఏలేశ్వరం: పార్టీలో చేరిన వారితో ఇన్‌ఛార్జి తమ్మయ్యబాబు

జనసేనలో పలువురి చేరిక

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : కష్టపడి పనిచేసే వారికి జనసేనలో గుర్తింపు ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. ఏలేశ్వరం 19 వార్డులో ఆదివారం పలువురు జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఇన్‌ఛార్జి స్వాగతం పలికారు. నాయకులు మసిరపు నాగేశ్వరరావు, వరుపుల సాయి కిరణ్ , ఎండీ అధికార్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు గదులు అద్దెకివ్వొద్దు

గండేపల్లి, న్యూస్‌టుడే: అనుమానాస్పద వ్యక్తులకు గదులు అద్దెకు ఇవ్వొద్దని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేట శివారులో పలు రెసిడెన్సీలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. అపరిచిత వ్యక్తులకు గదులు అద్దెకు ఇవ్వరాదని, భార్య, భర్తలుగా ఆధారాలు ఉంటేనే గదులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గండేపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వ్యాన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శివనాగబాబు వివరాల ప్రకారం.. గండేపల్లి గ్రామంలోని కాజులూరి వెంకటరమణ(60) ఆదివారం రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపునకు రోడ్డు దాటి వెళుతుండగా అటుగా వస్తున్న వాహనం వెంకటరమణను బలంగా ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయన ఘటనా స్థలంలో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆకట్టుకున్న తాటక వధ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ధర్మవరం గ్రామంలో శ్రీగౌరీశంకరుల ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థులు తాటక వధ ఘట్టాన్ని ఆదివారం ప్రదర్శించారు. పద్యాలు, సంభాషణలతో సంక్షిప్తంగా సాగిన ఈ ఘట్టాన్ని గ్రామంలోని పలువీధుల్లో ప్రదర్శించారు. గ్రామానికి చెందిన మాణిక్యం, అప్పికొండ, అప్పలస్వామి, వెంకన్నబాబు రామలక్ష్మణులు, తాటక తదితర పాత్రలను అభినయించారు. రాయి సుబ్బారావు, దాడి శ్రీను ఆహార్యాన్ని అందించారు.



ధర్మవరంలో తాటకను సంహరించే ఘట్టం ప్రదర్శన



వైద్యసేవలు పొందుతున్న రోగులు

250 మందికి వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు సత్యసాయి సేవా భవన్‌లో వ్యాస్కులర్ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఏషియన్ వ్యాస్కులర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 250 మందికి రక్తనాళాలకు సంబంధించిన పరీక్షలు చేశారు. వైద్యశిబిరాన్ని సత్యసాయి సేవా సమితి ప్రతినిధి, న్యాయవాది కొల్లా వీర్రాజు ప్రారంభించారు. డాక్టర్లు సోమాచారి, స్వాతి సేవలందించారు. సమితి వైద్యవిభాగ జిల్లా కోఆర్డినేటర్ సత్తిబాబు, సమితి సభ్యులు సాయి లక్ష్మి, బదరి, కొమ్ముల జయబాబు తదితరులు శిబిరంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆ దారిలో అన్నీ సవాళ్లే..!

ప్రత్తిపాడు ఇందిరాకాలనీ నుంచి కిర్లంపూడి మండలం వేలంక వెళ్లే దారి ఇది. రెండు మండలాల మధ్య రాకపోకలు సాగే ఈ రహదారి వెంబడి అటూ ఇటూ దట్టమైన తుప్పలు ఎదిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించలేని పరిస్థితికి తోడు విష జంతువులు ఈ రహదారిపై జనాన్ని పగటిపూటే భయపెడుతున్నాయి. సుమారు 3 కి.మీ పొడవు ఉండే మార్గం కొత్తచెరువు గట్టు వెంబడి సాగుతుంది. రైతులతో సహా అనేక మందికి ఈ రోడ్డు నిత్యావసరం. ఉపాధి పథకంలో గతంలో అనుసంధాన రహదారిగా అభివృద్ధి చేసినా ఇటీవల నిర్వహణ లేక రాకపోకలు సవాలుగా మారాయి. కాలనీ శివారున ఇదే రహదారికి అడ్డంగా చెత్తను పోగేస్తున్నారు. ఇది సమీప ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారు. ప్రత్తిపాడులో ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడంతో పాటు చెత్తను కాలనీల చివర, చెరువు గట్లు వెంబడి వేస్తున్నారు. వేలంక రోడ్డు వెంబడి తుప్పలను తొలగించడంతోపాటు, చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కుమార్‌బాబు వివరణ ఇచ్చారు.

\- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు



ఇందిరాకాలనీ నుంచి వేలంక వెళ్లే దారి వెంట పొదలు



కాలనీ శివారున రోడ్డుకు అడ్డంగా చెత్తపోగులు

24 నుంచి గ్రామసభలు

గండేపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 24 నుంచి గ్రామాల్లో రీసర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు గండేపల్లి తహసీల్దారు శ్రీనివాస్ తెలిపారు. 24న బొర్రంపాలెం, 25న తాళ్లూరు, 26న యర్రంపాలెం, 29న సింగరంపాలెం, 30న ఎన్టీ. రాజపురం గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు.

రీ సర్వేను రద్దు చేయాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: లోపభూయిష్టంగా జారీ చేసిన పాసుపుస్తకాలను వెనక్కు తీసుకుని భూముల రీసర్వేను రద్దు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహాజన సభ డిమాండ్ చేసింది. ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈసభలో రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎం.శ్రీధరరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు దిశానిర్దేశం చేశారు. రీసర్వే తర్వాత రైతుల రికార్డులు అస్తవ్యస్తం అయ్యాయన్నారు. తుపానుకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మహాజనసభ తీర్మానం చేసింది. కిసాన్ సంఘ్ రాష్ట్ర నేతలు పతిరాజు, యల్లపు సూర్యనారాయణ, జలగం కుమారస్వామి, వెంకటరెడ్డి జిల్లా రాసంశెట్టి రాజా, రాజబాబులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న పరిమి వెంకట రాఘవులు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ అధ్యక్షుడిగా రాసంశెట్టి రాజా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గట్టి అశోక్, ఉపాధ్యక్షుడుగా నీలగిరి చిట్టిబాబు, కోశాధికారిగా కంపరపు నాగేశ్వరరావు తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు.

వరి పంటలో చీడపీడలు

కిర్లంపూడి: ప్రతికూల వాతావరణంలో వరి పంటలపై చీడపీడలు వెంటాడుతున్నాయి. ఉదయాన్నే వర్షం.. కొద్దిసేపటికి తీవ్రమైన ఎండ, రాత్రి సమయాల్లో మంచు కారణంగా పంటలపై తెగుళ్లు, పురుగులు విజృంభిస్తున్నాయి. ఏలేరు వరదల కారణంగా మండలంలోని పలుగ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనిపై వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేస్తున్నప్పటికీ పంటలను రక్షించుకోవడం కష్టంగా మారిందని రామకృష్ణాపురం, చిల్లంగి, రాజుపాలెం, ముక్కొల్లు, వీరవరం, గ్రామాల రైతులు అంటున్నారు.

దాత సాయంతో అన్న క్యాంటీన్

గండేపల్లి(జగ్గంపేట): జగ్గంపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం అన్న క్యాంటీన్ నిర్వహించనున్నట్లు తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ తెలిపారు. గండేపల్లికి చెందిన ఇప్పెర్ల బాబురావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సురేష్ ఆర్థిక సాయంతో అన్నా క్యాంటీన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆహ్లాదమా.. ఎక్కడా..?

✦ పేరుకే పార్కులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో తెల్లారి లేచింది మొదలు.. ఉరుకులు, పరుగుల జీవితమే. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో ఎక్కడా ఆహ్లాద ప్రదేశాలే కరవు. మేజర్ పంచాయతీ నుంచి పురపాలనకు వెళ్లిన ఏలేశ్వరం పట్టణంలో వాహనాల రోదనలే తప్ప ఆటవిడుపు ప్రాంతాలే లేవు. పట్టణంలో ఉద్యానాలు ఉన్నా... నిర్వహణ అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు ఉద్యానాల దుస్థితికి అద్దం పడుతున్నాయి.



తుప్పలతో నిండిన ఉద్యానం ఇలా..

పెరిగిన తుప్పలు..

మూడో వార్డులో 2014- 19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉద్యానవనాన్ని ఏర్పాటుచేశారు. విశాలమైన స్థలాన్ని సమకూర్చి, చుట్టూ ప్రహారీ నిర్మించారు. పార్కులో క్రీడా సామగ్రి, వ్యాయామానికి ఉపకరించే పరికరాలను నగర పంచాయతీ ద్వారా సమకూర్చారు. ఇక్కడకు రోజూ పిల్లలు, పెద్దలు వచ్చి సేద తీరేవారు. ఉత్సాహంగా గడిపేవారు. వైకాపా పాలన వచ్చాకా ఉద్యానవన నిర్వహణను గాలికొదిలేశారు. క్రీడా పరికరాలు, వ్యాయామానికి అమర్చిన సామగ్రి నేలకొరిగాయి. ప్రవేశ ద్వారాన్ని తుప్పలు, పిచ్చి మొక్కలు మూసేశాయి.




పార్కులో నిరుపయోగంగా పరికరాలు

పెద్ద వీధిలో పేరుకే..

పెద్ద వీధిలో 25ఏళ్ల కిందట పార్కులో రెండు బెంచీలు ఏర్పాటుచేసి తమ పని అయిపోయిందనిపించారు. పార్కులో పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇది ఉద్యానం అంటే ఎవరూ నమ్మరు.

పట్టించుకుంటే బాగు



పట్టణంలో విశాలమైన స్థలాల్లో మూడు ఉద్యానాలు ఉన్నాయి. ఉల్లాసాన్ని ఇచ్చే సామగ్రి, పరికరాలను సమకూర్చుకోవాలి.. ఉన్న వాటిని సద్వినియోగం చేసుకోవాలి. విశ్రాంత ఉద్యోగులు, అధికారులకు కాస్తంత సేద తీరే స్థలాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఉద్యానాలను తీర్చిదిద్దాలి.

- తూమురౌతు గుర్రయ్య, విశ్రాంత ఉద్యోగి, ఏలేశ్వరం

సమస్యలు పరిష్కరిస్తాం

పట్టణంలోని ఉద్యానాలను పరిశీలిస్తా. ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించా. ముందుగా పార్కుల నిర్వహణకు ప్రాధ్యానమిస్తాం. నగర పంచాయతీ పాలక వర్గం సహకారంతో సౌకర్యాలు పెంపునకు అవసరమైన పనులు చేయిస్తాం.

- ఎం.సత్యనారాయణ, కమిషనర్, నగర పంచాయతీ, ఏలేశ్వరం

వధువుకు పెళ్లికానుక అందజేత

జగ్గంపేట గ్రామీణం: గుర్రంపాలెంలోని నూతన వధువుకు తెదేపా కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పెళ్లికానుక అందజేశారు. గ్రామానికి చెందిన బి.సత్యనారాయణ కుమార్తె వరలక్ష్మి-మణికంఠస్వామి వివాహ వేడుకలో పాల్గొని రూ.20 వేల చెక్కును అందించారు.

పశువైద్యాధికారికి అభినందనలు

రౌతులపూడి: పశువైద్యుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముద్రగడ వీరరాఘవరావుకు పలువురు అభినందనలు తెలిపారు. రౌతులపూడి మండల పశువైద్యాధికారిగా పనిచేస్తున్న వీరరాఘవరావును ప్రధాన కార్యదర్శిగా సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.